


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




అచ్చెన్నకు బాబు
బర్త్‌డే విషెస్

6

# రాష్ట్ర భవిష్యత్తు.. జిల్లాల చేతుల్లో

3వ విడత రెండు రోజుల కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దార్శనిక నిర్దేశమిది. రెండు రోజులపాటు ఏకబిగిన సుదీర్ఘంగా సాగిన సదస్సులో రాష్ట్ర ఆర్థిక వృద్ధి, పాలన కోసం దార్శనిక దృక్పథాన్ని కలెక్టర్లకు బోధించడంలో ముఖ్యమంత్రి కృతకృత్యులయ్యారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించాలని.. వేగవంతమైన అభివృద్ధికి పెట్టుబడులను సులభతరం చేయాలన్న అనేకానేక ప్రాధాన్యతాంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సదస్సు మూలాంశాన్ని ముగింపు వాక్యంగా చెప్పిన ముఖ్యమంత్రి -ఆంధ్రప్రదేశ్ రూ.42,000 తలసరి ఆదాయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న విషయాన్ని కలెక్టర్లకు వివరించారు. ఈ లక్ష్య సాధనకు రాష్ట్రం వార్షికంగా 15శాతంకంటే ఎక్కువ వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లాకూ సంపదను సృష్టించగలిగే కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయని, ఆ అవకాశాలను సద్వినియోగంలోకి తెచ్చి.. లక్ష్య వృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన బాధ్యతలను కలెక్టర్లు భుజానికెత్తుకోవాలని కోరారు.

> నా మాటలు గుర్తు పెట్టుకోండి. 2047నాటికి భారత దేశం గ్లోబల్‌గా నంబర్ వన్ అవుతుంది. అందులో 33శాతం తెలుగు జాతి ఉండాలనేది నా ఆలోచన, ఆకాంక్ష. మన ప్రతి అడుగూ ఆ దిశగానే పడాలి.











రెండు రోజుల సమావేశంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు మొత్తం 26 జిల్లా కలెక్టర్ల ప్రెజెంటేషన్లను సమీక్షించి, వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని అందించారు. ప్రతి కలెక్టర్.. ప్రతి జిల్లాలో క్రమం తప్పకుండా పర్యటించాలని.. ప్రజలతో మమేకం కావాలని.. తలసరి ఆదాయం పెరుగుదలకు ఉన్న చొరవలను గుర్తించాలని సూచించారు. చురుకైన నాయకత్వ ప్రాముఖ్యతను వివరిస్తూనే.. కలెక్టర్లే ఆవిష్కర్తలు, ప్రేరేపకులు కావాలని పిలుపునిచ్చారు. అంతిమంగా పాలనను గ్రామస్థాయికి చేర్చి.. గ్రామస్థాయినుంచే లక్ష్య సాధనకు పునాదులు పడేలా సంధానకర్త బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

మా ప్రభుత్వ నినాదం 'ప్రజలే ముందు'. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం తరపున చేసిన దిశానిర్దేశం కూడా ఇదే. ప్రజా ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించాలనే అధికారులను కోరాను. ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన వనరులు, అవకాశాలూ ఉన్నాయి. వీటిని వృద్ధికి ఉపయోగించొచ్చు. జిల్లాను పూర్తిగా అర్థం చేసుకుని అభివృద్ధికి కొత్త మార్గాలు అన్వేషించమని సూచించాను. నీరు, పశుగ్రాసం సరఫరావంటి కీలక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్లను కోరాను. వ్యవసాయం, పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, ప్రజా సేవల రంగాలలో చొరవ తీసుకొని పురోగతి సాధించమని ప్రోత్సహించాను. అదనంగా, పీ-4 ప్రాజెక్ట్‌కు నాయకత్వం వహించాలని.. ప్రజాసేవ ద్వారా శాశ్వత ప్రభావాన్ని సాధించాలని, ఆంధ్రప్రదేశ్ అందించే ప్రత్యేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్లను కోరాను.

-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

జోన్లువారీ ముఖ్యమంత్రి సమీక్షలు లోపలి పేజీల్లో...



## తల్లిదండ్రులే స్ఫూర్తి

- పేదరికంలేని సమాజమే చంద్రబాబు లక్ష్యం
- టెక్నాలజీని మంచికోసం వాడాలి, విధ్వంసానికి కాదు
- అగస్త్య విద్యార్థులతో నారా భువనేశ్వరి

6

## ఏపీకి జపాన్ పెట్టుబడులు

సహకార అన్వేషణపై చర్చలు: చంద్రబాబు

- వివరాలు 5లో..



## 31వరకే తొలి ఫ్రీ సిలిండర్

పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల



9

మద్యం కుంభకోణంపై

## కీలక నిర్ణయం దిశగా ఏపీ

- సీఎం చంద్రబాబుతో టీడీపీపీ నేత లావు భేటీ
- అటు కేంద్ర హోంమంత్రికీ పూర్తి సమాచారం అందచేత
- వైసీపీలో గుబులు రేపుతోన్న లిక్కర్ వ్యవహారం

5



పాస్టర్ ప్రవీణ్ మృతిపై

## అన్ని కోణాల్లో విచారణ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
ఆధారాలు సేకరించామన్న ఎస్పీ

5

- ప్రతి జిల్లా అభివృద్ధి బాటలో ఉండాలి
- పర్యాటక, పారిశ్రామికాభివృద్ధిపై దృష్టిపెట్టండి
- కొత్త జిల్లాల కలెక్టరేట్లకు నిధులిస్తాం
- అధికారులకు పూర్తి అధికారాల బదలాయింపు
- సేంద్రీయ సేద్యం దిశగా అల్లూరి జిల్లా
- తలసరి ఆదాయంలో విశాఖ ఫస్ట్
- వచ్చే నెలలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్
- జోన్-1 జిల్లాల సమీక్షలో సీఎం చంద్రబాబు

## సరైన ప్రణాళికతోనే

# సమగ్రాభివృద్ధి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రతి జిల్లా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. రెండో రోజు కలెక్టర్ల సదస్సులో జోన్-1 పరిధిలోని ఆరు జిల్లాలపై సీఎం సమీక్షించారు. కలెక్టర్ల నుంచి 2025-26 యాక్షన్ ప్లాన్‌ను తీసుకున్న సీఎం.. జిల్లాస్థాయిలో పాలనపై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా టూరిజం రంగంపై ఎక్కువ దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. తాను 30 ఏళ్లుగా పర్యాటకాభివృద్ధిపై మాట్లాడుతున్నానని, అప్పుడు తన మాటలను అర్థం చేసుకోని కమ్యూనిస్టులు కూడా ఇప్పుడు టూరిజంపై తనతో ఏకీభవిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించారు. నిన్న తెలంగాణ అసెంబ్లీలో చర్చ సందర్భంగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడిన విషయాన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పర్యటకాభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రంలో కాస్మోపాలిటిన్ సిటీగా వృద్ధి చెందుతున్న విశాఖలో కనీసం ఐదు వేల హోటల్ గదులు అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. అదేవిధంగా అనకాపల్లి, అరకు ప్రాంతాల్లోనూ అధునాతన వసతులతో పర్యాటకులకు ఆతిథ్యం కల్పించాలని కలెక్టర్లకు నిర్దేశించారు.

కొత్తగా ఏర్పడిన అనకాపల్లి, అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కలెక్టరేట్లతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. పాత జిల్లా కేంద్రాలతో సమానంగా కొత్త జిల్లా కేంద్రాలు, జిల్లాలు అభివృద్ధి చెందాలని సీఎం సూచించారు. ఉమ్మడి జిల్లాలలోని అధికారులతో సంబంధం లేకుండా కొత్త జిల్లాలో అధికార్లకు పూర్తిస్థాయిలో పవర్స్ డెలిగేట్ చేయాలని, ఆయా జిల్లాలోని అధికారులు స్వేచ్ఛగా విధులను నిర్వహించే అవకాశం కల్పించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను హెచ్ఓడీలు రెండురోజుల్లో జారీచేయాలని ఆదేశించారు. కొత్త జిల్లాలలో ఎటువంటి సిబ్బంది సమస్య లేకుండా స్టాఫ్ రెగ్యులేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, పని ఒత్తిడికి తగ్గట్టుగా అధికారులు, సిబ్బందిని కేటాయించాలన్నారు. అల్లూరి జిల్లాను పూర్తిగా సేంద్రియ సేద్యం దిశగా ప్రోత్సహించాలని, విశాఖ, అనకాపల్లి జిల్లాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా కలెక్టర్లు యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. ఇప్పటికే అనకాపల్లి జిల్లాకు భారీ పరిశ్రమలు వస్తున్నాయని, ఈ పరిశ్రమల్లో పనిచేసేవారికి వసతి సమస్య రాకుండా ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

### తలసరి ఆదాయంలో విశాఖ ఫస్ట్.. శ్రీకాకుళం లాస్ట్

తలసరి ఆదాయంలో విశాఖ జిల్లా రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. రాష్ట్ర సగటు కన్నా విశాఖ ఎక్కువ తలసరి ఆదాయం సాధిస్తోందని అభినందించారు. విశాఖ తర్వాత అనకాపల్లి, అల్లూరి జిల్లాలు నిలుస్తున్నాయన్నారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా తలసరి ఆదాయంలో బాగా వెనకబడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ప్రోత్సహించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

### వీఎంఆర్డీఏలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

వచ్చే ఏడాదిలోగా నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లను సూచించారు. లక్షమంది పారిశ్రామికవేత్తలు, వన్ ఫ్యామిలి-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం వెల్లడించారు. విశాఖలో ఏర్పాటు చేయనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు.ఇందుకోసం వీఎంఆర్డీఏ భవనాలను సిద్ధం చేసినట్టు విశాఖ జిల్లా కలెక్టర్ చెప్పడంతో వచ్చేనెలలో ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విశాఖ నగరానికి కావాల్సిన కూరగాయలు అనకాపల్లి, అల్లూరి జిల్లాలనుంచి పంపేలా కలెక్టర్లు ప్రణాళిక రచించాలని సీఎం సూచించారు. అదేవిధంగా అల్లూరి జిల్లాలో ఆదివాసీలకు సమస్యగా మారిన ఆధార్ కార్డులను త్వరలో పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లక్షమంది గిరిజనులు, 35 వేలమంది పిల్లలకు ఆధార్ కార్డులులేని విషయాన్ని గుర్తించిన సీఎం చంద్రబాబు.. వెంటనే వారికి ఆధార్ కార్డులు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

---

- ఇందులో 20 శాతం వృద్ధిరేటు సాధించాలి
- రాజమండ్రిలో 5వేల గదులు లభ్యత ఉండేలా హోటళ్ల నిర్మాణం
- పామాయిల్ రంగంలో దేశంలో ఏపీనే నెంబర్ వన్
- ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి
- గోదావరి పుష్కరాలకు సన్నాహక చర్యలు చేపట్టండి
- ప్రత్యేకాధికారులుగా వీరపాండ్యన్, విజయరామరాజు
- అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం
- జోన్-2 జిల్లాల సమీక్షలో సీఎం చంద్రబాబు

## టూరిజం..

# ఓ గేమ్ ఛేంజర్!

అమరావతి(చైతన్య రథం):రాష్ట్రాభివృద్ధికి పర్యాటక రంగం గేమ్ ఛేంజర్ కాబోతోందని, అన్నిజిల్లాల కలెక్టర్లూ తమజిల్లాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన గోదావరి జిల్లాలపై కలెక్టర్లు ఇచ్చిన ప్రజెంటేషన్‌ను సమీక్షించారు.వృద్ధిరేటు పెంపునకు టూరిజం గ్రోత్ ఇంజన్‌లా పనిచేస్తుందని, అధికారులు ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా పనిచేయాలన్నారు. కనీసం ఈ రంగంలో 20 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతిజిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని, అక్కడ సుందర ప్రదేశాలు,ఆలయాలు సందర్శించేలా దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా జిల్లాలో ప్రణాళికలు రూపొందించి పనిచేయాలన్నారు. పర్యాటకులు రావడమే కాదు, వారికి తగిన సదుపాయాలు కూడా కల్పించాలన్నారు. రాజమండ్రిలో 5వేల గదులు లభ్యతకలిగేలా హెూటళ్ల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కేవలం రాజమండ్రి మాత్రమే కాకుండా విశాఖపట్నం,కాకినాడ,తిరుపతి,అమరావతి, అనంతపురంలో ఒక్కోప్రాంతంలో 5వేల గదులు లభ్యత ఉండేలా హోటళ్ల నిర్మాణానికి కలెక్టర్లు ప్రోత్సాహం అందించాలన్నారు.

### గోదావరి పుష్కరాలకు సన్నాహాలు

గోదావరి పుష్కరాలకు సన్నాహక చర్యలు మొదలుపెట్టాలని సీఎం అధికారులకు ఆదేశించారు. దీనికోసం వెంటనే ఇద్దరు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నామన్నారు. ఐఏస్ అధికారులు వీరపాండ్యన్‌ను ప్రత్యేకాధికారిగా, విజయరామరాజును అదనపు అధికారిగా నియమిస్తున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

### పామాయిల్ సాగులో ప్రగతి సాధించాలి

దేశంలో పామాయిల్ సాగులో మన రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉందన్నారు. దేశంలో 60శాతం పామాయిల్ సాగు మనరాష్ట్రంలోనే జరుగుతోందన్నారు. మరింత ఎక్కువగా రైతులను పామాయిల్ సాగువైపు ప్రోత్సహించాలన్నారు.జాతీయరహదారుల వెంబడి కూడా ఖాళీస్థలాల్లో పామాయిల్ చెట్లు పెంచే అవకాశాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిశీలించాలన్నారు. తద్వారా రహదారుల వెంబడి పచ్చదనం పెంచడమేకాకుండా రహదారులు శోభాయమానంగా కనిపిస్తాయన్నారు.

### కడియం నర్సరీలో నరేగా పనులు

కడియం నర్సరీలో నరేగా పథకం కింద పనులు చేపట్టాలని, దీనికి సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. ఆక్వారంగం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆక్వా వ్యర్థాలు వృథాగా పోకుండా వాటి ద్వారా ప్రొటీన్ ఉత్పత్తులు తయారచేసే పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

### డెల్టాలో మూడు పంటలు

కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో రైతులు మూడు పంటలు సాగుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దానికున్న సాధ్యసాధ్యాలను అంచనా వేసి రైతులు మూడు పంటలు పండించేలా ప్రోత్సహించాలన్నారు. వరి తర్వాత రెండు డ్రై క్రాప్స్ పండిచడానికి వీలు కల్పించాలన్నారు.

### గోదావరి జిల్లాలు పురోగమించాలి

గోదావరి జిల్లాలు పురోగమిస్తూ ప్రగతిపథంలో ముందుకెళ్లాలని,ఆ దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోనసీమ జిల్లా తలసరి ఆదాయం తక్కువగా ఉందని, ఎందుకు? అనేది అధికారులు విశ్లేషించుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలు పురోగతిలో ముందుండేవి,ఇప్పుడు కాస్తంత వెనుకబడుతున్నాయని, ఇది మంచిది కాదని, జిల్లాల అధికారులు వెంటనే దీనిపై దృష్టిసారించాలన్నారు.మెట్టప్రాంతమైన ఏలూరు తలసరి ఆదాయంలో ముందుంటే సారవంత మైన భూములున్న కోనసీమజిల్లా వెనుకబడిపోవడం సరి కాదని,దీనిపైన అధికారులు కృషి చేయాలన్నారు. తమ తమ జిల్లాల్లో వృద్ధిరేటు పెంపొందించుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

చైతన్యరథం

# సమస్యల పరిష్కారం కోసమే కలెక్టర్ల సదస్సులు

## కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, (చైతన్యరథం): సమస్యలకు పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 3వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన రెండవ రోజు మాట్లాడుతూ జిల్లాల్లో వచ్చే సమస్యలను సెక్రటరీలు, మంత్రులు పరిష్కరించాలన్నారు. అక్కడ పరిష్కారం కాకపోతే తన వద్దకు రావాలన్నారు. అన్నిటికీ డబ్బులే కాదని, ఆలోచనల ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం చూపొచ్చని సూచించారు. తాను నాలుగుసార్లు ముఖ్యమంత్రినయ్యానని కానీ ఎప్పుడూ ఇన్నిసార్లు కేంద్ర ఆర్థిక మంత్రిని కలవలేదని వెల్లడించారు. ఏపీకి కేంద్రం వివిధ రకాలుగా సాయం చేస్తోందన్నారు. అభివృద్ధి చేయాలని దానితో పాటు ఇచ్చిన హామీల మేరకు పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత ఉంటుందన్నారు.అప్పులు, వడ్డీలు చెల్లించే విషయంలో క్రెడిబిలిటీ పోకుండా వ్యవహరించాల్సి ఉందన్నారు. నిధుల కోసం, అప్పుల కోసం ఎన్ని మార్గాలు ఉంటే అన్ని మార్గాలు



అన్వేషిస్తున్నామన్నారు. అప్పులు తెచ్చేది అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమేనన్నారు. ఇలాంటి సమయంలో అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తాను మాత్రమే పరిగెత్తుతూ పనిచేస్తే సరిపోదన్నారు. తనతోపాటూ అంతా పరిగెత్తినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు.

గుంతలు పడిన 20 వేల కిలోమీటర్ల రోడ్లు బాగు చేశామన్నారు. ఇంకా రూ.1000 కోట్లు కావాల్సి ఉందని, వాటిని కూడా విడుదల చేస్తామని వెల్లడించారు. పథకాలు, కార్యక్రమాలపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకుంటున్నామన్నారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటే అందుకు అనుగుణంగా నాణ్యమైన సేవలు అందించవచ్చన్నారు.

### ఉగాది నుండి ప్రతిష్ఠాత్మకంగా పీ4

ప్రభుత్వం పీ4ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందని, ఉగాది రోజున దానికి నాంది పలుకుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. జీరో పావర్టీ అనేది అందరి లక్ష్యం కావాలన్నారు. తాను 1995లో విజన్ డాక్యుమెంట్ గురించి చెబితే ఎగతాళి చేశారని గుర్తు చేశారు. కానీ దాని ఫలితాలు కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు.


త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుదామన్నారు.

### గోదావరి పుష్కరాలకు కమిటీ ఏర్పాటు

గోదావరి పుష్కరాలకు కమిటీ వేశామని సీఎం వెల్లడించారు. కమిటీ నివేదిక మేరకు పనులపై దృష్టిపెట్టాలన్నారు.. అధికారులు ఫీల్డ్‌లో ఎక్కువ ఉన్నప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను గౌరవించాలని సూచించారు. తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో అధికారులు, నాయకులు కలిసి పనిచేయాలన్నారు. అప్పుడే సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయన్నారు. ఫాలోవర్‌గా కాకుండా లీడర్‌గా ఉండాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఆలోచనలు చేసి అమలు చేయాలన్నారు. జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలకు వెళ్లాలన్నారు. నిర్ణయాలు, చర్యలు మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. రూ.7లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నామని ఇవన్నీ గ్రౌండ్ అయ్యేలా కలెక్టర్లు చొరవ చూపాలన్నారు. పెట్టుబడుదారులకు ఇబ్బందులు కలిగించకుండా సానుకూల వాతావరణం కల్పించాలని ఆదేశించారు. వచ్చే సదస్సుకు మరిన్ని మార్పులు చేద్దామన్నారు. ఇకపై సమావేశాల్లో నేరుగా సమస్యలపైనే చర్చిద్దామన్నారు. సమస్య, పరిష్కారం అనే విధానంలో చర్చిద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సృజనాత్మకంగా ఆలోచించండి

## కలెక్టర్లకు సీఎం చంద్రబాబు నాయుడు సూచన



- హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమ
- ఉద్యానపంటలవైపు రైతులకు ప్రోత్సహించండి
- తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు చర్యలు
- అసెంబ్లీ సెగ్మెంట్లలో జాబ్‌మేళాలు కంప్లసరీ..
- మచ్చలేని మామిడితో రైతులకు ఆదాయం
- చిత్తూరులో త్వరలోనే మామిడి బోర్డు ఏర్పాటు
- వృద్ధిరేటులో నెల్లూరు టాప్.. ప్రకాశం వీక్
- జోన్-4 జిల్లాల సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ప్రతి కలెక్టర్ ఇతరులతో పోటీ పడి పనిచేయాలని, సృజనాత్మకంగా ఆలోచించి పాలన సాగించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. జోన్-4లోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు సమర్పించిన నివేదికపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వచ్చే సమావేశం నాటికి కలెక్టర్ల పనితీరులో మార్పు రావాలని ఆదేశించారు. వృద్ధిరేటు సాధించడంతోపాటు తలసరి ఆదాయం పెంచుకునేందుకు ఏం చేయాలనే విషయాలను కలెక్టర్లు సూచించాలని సీఎం చెప్పారు. ముఖ్యంగా పాడి పరిశ్రమతోపాటు ఉద్యానవన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలన్నారు. రాయలసీమను హార్టీకల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. పాడి ద్వారా రైతులకు ఉపాధి కల్పించాలని, ప్రతి పాడి రైతుకూ కనీసం రెండు పశువులుండేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పాడి పశువుల మేతకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను వాడుకోవాలని సూచించారు. కరువు వచ్చినా పాడి రైతుల ఉపాధికి ఢోకా ఉండదని, పాడి వృద్ధిచెందితే కూలీలకు ఉపాధి కూడా లభిస్తుందని సీఎం వివరించారు.

### తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

తిరుపతిలో ఏర్పాటు చేయనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు త్వరితగతిన భూమి, భవనాలను సేకరించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ కేంద్రాల ద్వారా వృత్తి నిపుణులను తయారు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ఉన్న ప్రధాన విద్యాలయాలు, వర్సిటీలను నోడల్ కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్స్ ద్వారా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో అవసరమైన వృత్తి నిపుణులను తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ కల్పించుకుని జపాన్, జర్మనీ దేశాల్లో హోమ్ కేర్ నర్సులకు శిక్షణ ఇస్తున్నామని సీఎం చంద్రబాబుకు వివరించారు.

### 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలి

రాష్ట్రంలో యువత ఉపాధి కల్పనకు ప్రతి నెలా క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. 175 నియోజకవర్గాల్లోనూ తప్పనిసరిగా జాబ్ మేళాలు నిర్వహించాలని, మూడు నెలల తర్వాత జరిగే కలెక్టర్ల సమావేశంలో దీనిపై పురోగతి చెప్పాలని సీఎం కలెక్టర్లకు సూచించారు. ప్రైవేటు కంపెనీలు, సంస్థల్లో ఉద్యోగాల కోసం యువతకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణనిచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### మచ్చలేని మామిడితో రైతులకు ఆదాయం

ఉద్యాన పంటలకు కేంద్రమైన రాయలసీమలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో మామిడి పండ్లకు కవర్లు కట్టడంవల్ల మంచి దిగుబడి రావడంతోపాటు రైతులకు లాభాలు వస్తున్నాయని ఆ జిల్లా కలెక్టర్ ప్రస్తావించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మచ్చలేని మామిడి పండ్ల వల్ల రైతులు అధిక ఆదాయం సంపాదిస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, రైతులకు సబ్సిడీపై కవర్లను అందజేయాలని సూచించారు.ఎకరా తోటలో మామిడి రైతులకు కవర్లు పంపిణీకి సుమారు రూ.24 వేల ఖర్చవుతుందని అధికారులు వివరించగా, 50శాతం రాయితీ ఇవ్వాలని అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు.

### తొమ్మిది నెలల్లో ఎలా ఉందంటే..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత జోన్-4 పరిధిలోకి వచ్చిన జిల్లాల వృద్ధి రేటుపై సమీక్షించారు. జోన్-4లోని ఐదు జిల్లాల్లో ప్రకాశంజిల్లా వెనకబడిందని ముఖ్యమంత్రి ప్రస్తావించారు.రాష్ట్ర వృద్ధిరేటు 12.02కన్నా ప్రకాశం జిల్లా వెనకబడిందని, ఆ జిల్లా వృద్ధిరేటు గత తొమ్మిది నెలల్లో కేవలం 10.46శాతంగా ఉందని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జోన్‌లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వృద్ధి రేటు బాగుందని ప్రశంసించారు. ఆ జిల్లా 14.45శాతం వృద్ధి సాధించగా, అన్నమయ్య జిల్లా 13.22శాతం, ఆ తర్వాత చిత్తూరు, తిరుపతి జిల్లాలు నిలిచాయని చెప్పారు.

### జిల్లాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి హామీ

కలెక్టర్ల సదస్సులో ఆయా జిల్లాల కలెక్టర్లు సమర్పించిన ప్రతిపాదనలపై సీఎం సానుకూలంగా స్పందించారు. ప్రకాశం జిల్లాకు సాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి సురక్షిత మంచినీటిని పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఒంగోలులో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా నెల్లూరు జిల్లాలోని కోవూరు షుగర్ ఫ్యాక్టరీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. చిత్తూరు జిల్లాకు ప్రధాన సమస్యగా మారిన కోతులు, ఏనుగుల సమస్యను నివారించేలా పనిచేస్తామన్నారు. కోతులకు కుటుంబ నియంత్రణ ఇంజక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని పలమనేరు నియోజకవర్గానికి గండికోట నుంచి మంచినీటిని సరఫరా చేస్తామన్నారు. ఏడు సాగునీటి పథకాలను పూర్తి చేస్తామని తెలిపారు.

### చిత్తూరులో మ్యాంగో బోర్డు

రాయలసీమలోని మామిడి పంటలను దృష్టిలో పెట్టుకుని చిత్తూరు జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అదేవిధంగా కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు తగిన నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. తిరుపతికి మంచినీటి సమస్య పరిష్కరించేలా మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్లను నిర్మిస్తామని చెప్పారు.

### డివైన్ ప్లేస్‌గా తిరుపతి

తిరుపతిని డివైన్ డెస్టినేషన్‌గా మార్చాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆధ్యాత్మికంగా తిరుపతికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా చాలామంది తిరుపతిలో స్థిరపడాలని చూస్తున్నారని, అందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. తిరుపతిలో కళ్యాణమండపాలు, హోటళ్ల నిర్మించాలని సీఎం సూచించారు.

# సాంకేతికంగా ఉద్యాన సాగు

- హార్టీకల్చర్, లైవ్‌స్టాక్ అభివృద్ధికి అవకాశం ◆ అధిక దిగుబడి మార్గాలు అన్వేషించండి
- మార్కెట్ సౌకర్యాన్ని విస్తృతం చేయాలి ◆ పర్యాటక, పారిశ్రామిక రంగాలపైనా దృష్టి
- సత్యసాయి జయంత్యుత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు ◆ జోన్-5 జిల్లాల సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): ఋతుపవనాలు వచ్చేలోపే ఉపాధి హామీ నిధులను ఉపయోగించుకొని పెద్దఎత్తున వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను నిర్మించడం ద్వారా భూగర్భ జలాల మట్టాలను పెంచేలా జిల్లా కలెక్టర్లు ప్రతిష్టాత్మక చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మూడవ జిల్లా కలెక్టర్ల సమావేశం 2వ రోజు జోన్-5లోని శ్రీ సత్యసాయి, నంద్యాల, అనంతపురం జిల్లాల ప్రగతి ప్రణాళికలను సమీక్షించారు. సమీక్షలో కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తూ.. ఋతుపవనాలు తదుపరి చెరువులు,రిజర్వాయర్లలోని భూఉపరితల జలమట్టాలు తగిన స్థాయిలో నిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాన్నారు. అదేవిధంగా కాల్వల ద్వారా ప్రవహించే జలాలనూ పరిరక్షించే విధంగా స్ట్రక్చర్లు నిర్మించాలన్నారు. ఈ జోన్‌లో హార్టికల్చర్, లైవ్‌స్టాక్ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తలసరి ఆదాయాన్ని పెంచాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగు విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో రాష్ట్రం ఉంది. ప్రత్యేకించి జోన్ 5లోని అనంతపురం, నంద్యాల, శ్రీ సత్యసాయి, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో ఉద్యాన పంటలను విస్తృత స్థాయిలో సాగు చేస్తున్నట్టు చెప్పారు. అయితే ఈ పంటల సాగు విషయంలో ప్రీ హార్వెస్టింగ్, హార్వెస్టింగ్, పోస్ట్ హార్వెస్టింగ్‌లో ఉత్తమ విధానాలను అమల్లోకి తెచ్చే అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఉద్యానవన ఉత్పత్తులకు తగిన ధరలు వచ్చేంతవరకు రైతులు నిలువ చేసుకునేలా కోల్డ్ చైన్ లింకేజీ సౌకర్యాలను పెంచడమే కాకుండా మార్కెటింగ్ సౌకర్యాలను విస్తృత పరచాలని సూచించారు. ఈ జోన్‌లోని ఐదు జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, ఈ అంశంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది వర్క్ ఫ్రం హోం విధానం ద్వారా పనిచేసేలా అవకాశం కల్పించేందుకై ప్రతి గృహానికి బ్రాడ్ బ్యాండ్ నెట్వర్క్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. టెంపుల్ టూరిజనికి విస్తృతస్థాయిలో అవకాశం వుందని, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ ఏడాది నవంబర్ మాసంలో జరుగనున్న శ్రీ సత్యసాయి శత జయంత్యుత్సవాలను పటిష్టంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను సకాలంలో పూర్తిచేయాలని, కర్నూలు స్మార్ట్ సిటీ ప్రాజెక్టును వర్కౌట్ చేయాలని ఆదేశిస్తూ.. కర్నూలు, అనంతపూర్, హిందూపూర్‌ను ఇండస్ట్రియల్ జోన్‌గా అభివృద్ధి పర్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. .

# అందుకు.. 30యేళ్లు పట్టింది!

## కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు చమత్కారం

- టూరిజంపై బాబు చేసిన వ్యాఖ్యలపై టి.అసెంబ్లీలో చర్చ
- ఎక్కువ ఖర్చులేకుండా ఉపాధి కల్పించే రంగమంటూ కొత్త భాష్యం
- చమత్కారంలోనే కలెక్టర్లకు టాస్క్ ఫిక్స్ చేసిన చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): తానుచెప్పిన మాటలను, తన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి 30యేళ్లు పట్టిందంటూ కలెక్టర్ల కాన్ఫరెన్స్ బుధవారంనాటి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చమత్కరించారు. ఏపీ కలెక్టర్ల సదస్సుల్లో తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని చేసిన వ్యాఖ్యలు ప్రస్తావనకు వచ్చిన సందర్భంలో సీఎం ఇలా చమత్కరించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో టూరిజంపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సభలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రస్తావించారు. 'ఇప్పుడు సమాజంలో ఏ ఇజం లేదు. ఉన్నదంతా టూరిజమేనని నాడు చంద్రబాబు అనేవారం'టూ కూనంనేని ప్రస్తావించారు. పత్రికలో వచ్చిన వార్తను కలెక్టర్ల సదస్సుల్లో టూరిజం అంశంపై మాట్లాడుతూ చంద్రబాబు చమత్కారంగా ప్రస్తావించారు. 'ఏ ఇజం లేదని నాడంటే కమ్యునిస్టులు విరుచుకుపడ్డారు. నాపై విమర్శలు గుప్పించారు. ఇప్పుడు తెలంగాణలో వామపక్ష ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖర్చులేని ఇజం టూరిజమేనంటూ స్టేట్మెంట్ ఇచ్చారని చంద్రబాబు ప్రస్తావిస్తూ.. 'నా మాటలలు, ఆలోచనలను అర్థం చేసుకోవడానికి 30యేళ్లు పట్టింది' అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. అయితే, ఇప్పుడంత సమయం లేదని... త్వరగా ప్రాజెక్టులు తెచ్చి ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో ఇటు రాయలసీమ నుంచి అటు ఉత్తరాంధ్ర వరకు టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్న చంద్రబాబు, కలెక్టర్లు జిల్లాలవారీ టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయనిఎ, ఎకానమీ పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందన్నారు. ఎక్కువ ఖర్చులేకుండా ఉపాధి కల్పించే రంగమే టూరిజమని ముఖ్యమంత్రి కొత్త భాష్యం చెప్పారు. ప్రతి జిల్లాలో కొన్ని ప్రత్యేకతలున్నాయని, వాటికి అనుగుణంగా పనిచేస్తే టూరిజం పెద్ద ఉపాధి మార్గమవుతుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.


కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తూ.. -రాష్ట్రంలో ఐదు జోన్‌లు ఉన్నాయి. జోన్-1లో విశాఖపట్నం, జోన్-2లో రాజమండ్రి, జోన్-3లో రాజధాని అమరావతి, జోన్-4లో తిరుపతి, జోన్-5లో అనంతపురం పవర్‌హబ్‌లుగా ఉన్నాయి. ఆ పవర్ హాబ్‌ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలనూ అభివృద్ధిపర్చేలా ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తే రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది' అన్నారు.

ప్రతి జోన్‌కు ఒక సీనియర్ అధికారిని ఇన్‌చార్జిగా ఉంచాము. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కూడా ఉన్నారు. వీరందరూ కలిసి ఆయన జిల్లాలను, ప్రాంతాలను ఏవిధంగా అభివృద్ధిపర్చాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే విధంగా, గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని రియల్ టైమ్‌లో పరిష్కరించేందుకు వచ్చే నెలనుంచి సీనియర్ అధికారులు గ్రామాల్లో మూడు నాలుగు రోజులు ప్యటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# మద్యం కుంభకోణంపై కీలక నిర్ణయం దిశగా ఏపీ

- సీఎం చంద్రబాబుతో టీడీపీపీ నేత లావు భేటీ
- అటు కేంద్ర హోంమంత్రికీ పూర్తి సమాచారం అందచేత
- వైసీపీలో గుబులు రేపుతోన్న లిక్కర్ వ్యవహారం

అమరావతి (చైతన్య రథం): ఏపీ సీఎం చంద్రబాబుతో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు భేటీ అవ్వడం వైసీపీ వర్గాల్లో గుబులు రేకెత్తిస్తోంది. మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ తరువాత, రాష్ట్రానికి చేరుకున్న ఎంపీ లావు బుధవారం సీఎం చంద్రబాబుతో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మద్యం కుంభకోణం వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందనడానికి ఇదొక ఉదాహరణ. మద్యం స్కాంపై కీలక నిర్ణయం దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. గత వైసీపి ప్రభుత్వ హయాంలో భారీగా మద్యం కుంభకోణం జరిగిందని ఎంపీ లావు పార్లమెంటులో మాట్లాడటం తెలిసిందే. రూ.4 వేల కోట్లను విదేశాలకు తరలించారన్న అంశాన్ని బయటపెట్టడమే కాదు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి చర్చించారు. బుధవారం ముఖ్యమంత్రిని కలిసి ఢిల్లీ పరిణామాలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నివేదించినట్టు సమాచారం. కాగా ఢిల్లీ మద్యం కుంభకోణానికి ఎన్నో రెట్లు అధికంగా గత జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీలో అక్రమ మద్యం వ్యాపారం జరిగిందని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం లోక్‌సభలో చేసిన తీవ్ర ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా దృష్టి సారించారు. మంగళవారం పార్లమెంటు సమావేశాల మధ్యలోనే ఆయనను ప్రత్యేకంగా తన కార్యాలయానికి పిలిపించుకొని వివరాలు తెలుసుకున్నారు. ఏపీ కుంభకోణంతో పోల్చితే ఢిల్లీ కుంభకోణం నీటి బొట్టంతేనని ఈ సందర్భంగా లావు అయనకు వివరించినట్టు సమాచారం. సంబంధిత కీలక పత్రాలనూ హోంకు అందచేసినట్టు తెలుస్తోంది. రూ.90వేల కోట్ల మద్యం వ్యాపారంలో రూ.18 వేల కోట్లు దుర్వినియోగమయ్యాయని, అవికాకుండా మరో రూ.4 వేల కోట్లు, బినామీ పేర్లతో దుబాయ్, ఆఫ్రికాలకు తరలించారన్న ఆరోపణలపై హోంమంత్రి ఆరా తీశారని తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ఎన్ సునీల్‌రెడ్డి రూ.2 వేల కోట్లను దుబాయ్‌కి తరలించిన కీలకపత్రాలను లావు అందించారని సమాచారం. ఈ లావాదేవీలపై ఈడీ క్షుణ్ణంగా దర్యాప్తు జరిపితే అనేక కీలక వివరాలు బయటకు రావడం ఖాయం. ఈ విషయంపై తాము క్షుణ్ణంగా దర్యాప్తు జరిపిస్తామని అమిత్ ఆయనకు హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఏపీ మద్యం కుంభకోణం పర్యావసానాల వల్లే ఒక ఎంపీ రాజీనామా చేసి, రాజకీయాల నుంచి నిష్క్రమించారని కూడా లావు వివరించారు. రాష్ట్రంలోని 22 డిస్టిలరీలను చేజిక్కించుకుని అర్థంపర్థం లేని బ్రాండ్లతో 26 కొత్త కంపెనీలను ప్రారంభించారని, అంతర్జాతీయ బ్రాండ్లన్నింటినీ వెళ్లగొట్టారని తెలిపారు. ప్రభుత్వ దుకాణాలలో రూ.99 వేల కోట్ల మేరకు అమ్మకాలు జరిగితే, అందులో రూ.690 కోట్లు మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరిగాయని, మిగతా సొమ్ములో అత్యధిక భాగం జగన్, అయన అనుయాయులు కబళించారని వివరించారు. భారీ మద్యం కుంభకోణంపై దృష్టిపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం సైతం -సాధ్యమైనంత త్వరగా నిగ్గుతేల్చే పనిలో ఉన్నట్టే కనిపిస్తోంది.



# ఏపీకి జపాన్ పెట్టుబడులు

## సహకార అన్వేషణపై చర్చలు: చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ పెట్టుబడులను విస్తరించేందుకు ఉన్న అవకాశాలపై ఆ దేశ ప్రతినిధి బృందంతో చర్చలు జరిపినట్టు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ 'జపాన్ రాయబారి మిస్టర్ కెయిచి ఓనో నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో అమరావతిలో సమావేశమయ్యాను. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లో జపాన్ పెట్టుబడులను విస్తరించడం, వృద్ధికి కొత్త అవకాశాలను అందించేలా నౌకానిర్మాణం, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఆటోమొబైల్స్ మరియు విద్యవంటి వివిధ రంగాలలో సహకార అన్వేషణపై చర్చలు సాగించాము. సానుకూల వాతావరణంలో సంతృప్తికరమైన చర్చలు సాగాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై అన్ని కోణాల్లో విచారణ

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం ◆ కొన్ని ఆధారాలు సేకరించామన్న ఎస్పీ

రాజమహేంద్రవరం, అమరావతి (చైతన్య రథం): హైదరాబాద్ తిరుమలగిరి సమీపంలోని ఎస్బీహెచ్ కాలనీకి చెందిన క్రీస్తు సందేశకుడు, ప్రసంగికుడు పగడాల ప్రవీణ్‌కుమార్ (45) మృతి చెందిన విషయం తెలిసిందే. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వద్ద రోడ్డుపక్కన ప్రవీణ్ మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ మృతి చెందలేదని, హత్యేనని పాస్టర్లు ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. పాస్టర్ మృతి ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారు. ఈ విషయంపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. చాగల్లులో జరిగే క్రైస్తవ సభలకు హాజరయ్యేందుకు రాత్రి ద్విచక్ర వాహనంపై రాజమండ్రి వస్తుండగా ఘటన చోటు చేసుకోవడం తెలిసిందే.



### విచారణ చేయిస్తున్నాం: హోంమంత్రి

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై లోతైన విచారణ చేయిస్తున్నట్టు హోంమంత్రి అనిత వెల్లడించారు. డీఎస్పీస్థాయి పోలీసు అధికారుల కమిటీ విచారణ చేస్తోందన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఘటనపై దర్యాప్తు చేస్తోందన్నారు. రాజమహేంద్రవరంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిని కేవలం యాక్సిడెంట్‌గా మాత్రమే పరిగణించటం లేదన్న హోం మంత్రి.. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందన్నారు. రాజకీయంగా, మతపరంగా విద్వేషాలు రగిలేలా వ్యవహరించొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందా? ఏమైనా ఇంటెన్షన్ ఉందా? అన్న దానిపైనా విచారణ చేస్తున్నామన్నారు. అనుమానాస్పద మృతిగానే ఈ ఘటనపై ఎస్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఘటనా స్థలికి సమీపంలో కాల్ డేటా రికార్డులు కూడా తీసుకుంటున్నామన్నారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావన అవసరం లేదని హోం మంత్రి వెల్లడించారు.

### కొన్ని ఆధారాలు దొరికాయి..: ఎస్పీ

ఈక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ రాజమహేంద్రవరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. "రోడ్డు పక్కన మృతదేహం పడి ఉందని మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహం పక్కనే సెల్ఫోన్ గుర్తించారు. చివరి ఫోన్ కాల్ రామ్మోహన్ ఆర్జే వైకి వెళ్లినట్టుగా ఉంది. పోలీసులు ఆయనకు ఫోన్ చేయగా.. రామ్మోహన్, అతని భార్య ఘటనాస్థలికి చేరుకుని ఆ మృతదేహం ప్రవీణ్దిగా గుర్తించారు. ప్రవీణ్ హైదరాబాద్లో ఉంటారని, వివిధ ప్రాంతాల్లో మత బోధకుడిగా సేవలందిస్తారని తెలిపారు. దీంతో హైదరాబాద్లో ఉన్న ఆయన కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాం. ప్రవీణ్ బావమరిది నిన్న సాయంత్రం వచ్చి అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు ఇవ్వడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

ఘటనా స్థలిలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో కొన్ని ఆధారాలు సేకరించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌తో విచారణ జరిపించాలని నిర్ణయించాం. టీమ్ ఆఫ్ డాక్టర్స్‌తో పోస్టుమార్టం చేయించాం. ఈ ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేయించాం. కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో ప్రవీణ్ ద్విచక్రవాహనంపై వెళ్తున్నట్టు సీసీటీవీ ఫుటేజ్ సేకరించాం. సోమవారం రాత్రి 11.43 గంటలకు రోడ్డు ప్రమాదం జరిగినట్టు సీసీటీవీ ఫుటేజ్ని బట్టి తెలుస్తోంది. మాకు లభ్యమైన ఆధారాలపై లోతుగా దర్యాప్తు చేస్తాం. కేసు విచారణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. ఈ కేసుకు సంబంధించి ఎవరి దగ్గరైనా ఆధారాలు ఉంటే ఇవ్వాలని కోరుతున్నాం. పోస్టు మార్టం అనంతరం ఆందోళనకారులను ఒప్పించి మృతదేహాన్ని హైదరాబాద్కు తరలించాం" అని జిల్లా ఎస్పీ తెలిపారు.

## పాస్టర్ మృతి దిగ్భ్రాంతికరం: లోకేష్

అమరావతి (చైతన్య రథం): పాస్టర్ పగడాల ప్రవీణ్ హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. పాస్టర్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియచేస్తూ.. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో రోడ్డు ప్రమాదంగా గుర్తించారని, వివిధ సంఘాలు పాస్టర్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించిందని లోకేష్ పేర్కొన్నారు.



# తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి

- కుటుంబం కోసం వాళ్ల కష్టాన్ని కళ్లారా చూశా
- పేదరికం లేని సమాజమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- టెక్నాలజీని మంచికి వాడాలి.. విధ్వంసానికి కాదు
- దేవాన్ష్‌లాగే తక్కువ స్క్రీన్ టైమింగ్ పాటించండి
- సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం గ్లోబల్‌గా ఎదగాలి
- అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో నారా భువనేశ్వరి



కుప్పం (చైతన్యరథం): టెక్నాలజీని వ్యక్తిత్వ వికాసానికి వాడుకోవాలని.. విధ్వంసానికి కాదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని వాడుకోవడం తెలియక కొంతమంది యువత దానిని దుర్వినియోగం చేస్తోందని, ఇది వారి భవిష్యత్తు ను కాలరాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్లు, గాడ్జెట్లను ఎంతమేరకు వాడుకోవాలో అందరూ తెలుసుకోవాలని సూచించారు. కుప్పంలోని అగస్త్య ఇంటర్నేషన ల్ ఫౌండేషన్‌ను నారా భువనేశ్వరి సందర్శించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె ప్రసం గించారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, అందరూ బాగా చదువుకుని దేశం గర్వించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. అతిగా ఫోన్ల వాడకం, అధిక సమ యం స్క్రీన్ చూడడం వల్ల విద్యపై దృష్టి మరల్చలేకపోతున్నారని అన్నారు. ఈ విష యంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని, తమ మనవడు దేవాన్ష్ కూడా ఫోన్లు, గాడ్జె ట్లు ఎంతమేరకు వాడాలో అంతమేరకే వాడతాడని పేర్కొన్నారు. అధిక సమయం స్క్రీన్ మీద గడపడం ఉండదని తెలిపారు. ఓ తల్లిగా చెబుతున్నానని.. టెక్నాలజీని వ్యక్తిత్వ వికాసానికి మాత్రమే వాడుకోవాలని సూచించారు.

### విద్య, పరిశోధనలకు అధిక ప్రాధాన్యం

విజ్ఞానంతో నడిచే ఆర్థిక వ్యవస్థ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ కోరుకుంటారు. సామాజిక, ఆర్థిక ప్రగతికి విద్య చాలా కీలకమని ఆయన భావిస్తారు. విద్య, పరిశోధనలు దేశ ప్రగతికి కీలకం. అందువల్లే తన పాలనలో సైతం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్ ఎప్పుడూ ఉండాలని ఆయన కోరు కుంటారు. అందుకే శాస్త్రీయ అవగాహనను పెంచే సంస్థ అయిన అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు 1999లో 172 ఎకరాలు కేటాయించారు. దీని కారణంగా ఎటువంటి ఫలితాలు వస్తున్నాయో ఇప్పుడు చూస్తున్నాం. ప్రపంచంలో జనాభాలో రెండో స్థానంలో ఉన్న మన దేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో 53వ స్థానంలో ఉంది. 2023లో సైన్స్ అండ్ టెక్నాలజీలో పేటెంట్లు పొందడంతో భారత్ ఆరో స్థానంలో ఉంది. త్వరలోనే మన దేశం గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. సైన్స్ రంగంలో పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయిం చాలి. సైంటిఫిక్ టెంపర్‌ను విద్యార్థుల్లో పెంచడం కోసం తన మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని తెలిపారు.

### నిత్యం ప్రజా సేవలోనే..

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలే కుటుంబసభ్యులు. ఆయన నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తారు. ఏపీని నెంబర్‌వన్ స్టేట్ చేయాలని, పేదరికం



లేని సమాజం స్థాపించాలని అనునిత్యం తపిస్తారు. స్వర్ణాంధ్ర - విజన్ 2047 లక్ష్యంగా ఆయన పని చేస్తున్నారు. ఆయన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఒక్కోసారి రాత్రి 12 గంటల వరకూ పనిచేస్తారు. అయినా ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి యోగా చేస్తారు. నాకు చిన్న వయసులోనే వివాహమైంది. రాజకీయాల గురించి అప్పట్లో తెలియదు. హెరిటేజ్ వ్యవ హారాలు, ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చూసుకునేదాన్ని. చల్లపల్లిలోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలి చారు. వారిని చూస్తే నాకు గర్వంగా అనిపిస్తుంది. యువత బాగా చదువుకోవాలి. ఉన్న తమైన లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించాలి. టెక్నాలజీ మీద అవగాహన పెంచు కోవా లి. క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై దృష్టి పెడితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని సూచించారు.

### నాన్న కష్టాన్ని కళ్లారా చూశాను..తల్లిదండ్రులే స్ఫూర్తి

నా తల్లిదండ్రులే నాకు స్ఫూర్తి. మా నాన్నగారు ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్‌కు వెళ్లి చదువుకునే వారు. కుటుంబం కోసం ఆయన పడిన కష్టం మేము కళ్లారా చూశాం. షూటింగులతో బిజీగా ఉండటం వల్ల మేము ఆయన్ని చాలా రోజులు చూసేవాళ్లం కాదు. మేము నిద్ర పోయినప్పుడు వచ్చేవాళ్లు...లేచేప్పటికి వెళ్లిపోయేవాళ్లు. మా తల్లిదండ్రులు మమ్మల్ని చాలా పద్ధతిగా పెంచారు. ఇంటికి వచ్చే అతిథులను ఎలా గౌరవించాలో మా అమ్మ అందరికీ చెప్పేవారని తెలిపారు. అనంతరం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యా ర్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు.

### మహిళలతో సమావేశం

మొదటి రోజు కుప్పం పర్యటనలో భాగంగా గుడిపల్లి మండలం, గుడి చేబంబగిరి గ్రామంలో మహిళలతో భువనేశ్వరి సమావేశమయ్యారు. మహిళల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలతో కలిసి కోలాటం ఆడారు.

### నంది గోశాల సందర్శన

కర్ణాటకలోని కోలార్ జిల్లా కేజీఎఫ్ పరిధిలోని నంది గోశాలను నారా భువనేశ్వరి బుధవారం సందర్శించారు. నిజం గెలవాలి యాత్ర సమయంలో గోశాలలో నీరు లేక గోవులు అల్లాడుతున్నాయని గోశాల నిర్వాహకులు నారా భువనేశ్వరి దృష్టికి తీసుకురాగా వెంటనే బోరు వేయించారు. ఈ సందర్భంగా గోశాలను సందర్శించగా మహిళలు ఘన స్వాగతం పలికారు.

# ఘనంగా మంత్రి అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

## సహచర మంత్రుల మధ్య కేక్ కటింగ్ - శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించా రు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సచివాల యంలో రెండోరోజు కలెక్టర్ల సదస్సుకు వచ్చిన ఆయనను ఆత్మీయంగా ఆలింగనం చేసు కున్నారు. అనంతరం సహచర మంత్రులు మధ్య కేక్ కట్ చేశారు. ఆయా జిల్లాల కలెక్ట ర్లు, సహచర మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, సహచర మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కె.పార్థసారథి తదితరు లు పాల్గొన్నారు. కింజరాపు కుటుంబంతో తమకు ఉన్న అనుబంధం పంచుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వరాంధ్ర సాధన, ప్రజా సేవ లో నిమగ్నమవ్వడానికి భగవంతుడు సంపూర్ణ ఆయు రారోగ్యాలు ప్రసాదించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పలువురు ప్రజాప్రతినిధులు సందేశం పంపారు.

### ఆత్మీయుల మధ్య వేడుకలు ఆనందాన్నిచ్చింది

ఆత్మీయులు, శ్రేయోభిలాషుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిన వారందరికీ, ముఖ్యంగా తనపై ప్రేమాభిమానాలు చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. సహచర మంత్రులు, తమ కుటుంబసభ్యులుగా భావించే కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేయడం మరిచిపోలేని మధురానుభూతిని కలిగిం చిందని తెలిపారు.

చైతన్యరథం

















## ఐసీఎమ్మార్ నిపుణులతో తిరువూరు కిడ్నీ వ్యాధులపై అధ్యయనం

**- వర్షాకాలంలోపే బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు చేస్తాం**

**- జిల్లాలో కొత్తగా పది ఇసుక రీచ్‌ల గుర్తింపు**

**- ఆటోనగర్‌కు లక్ష మంది మెకానిక్‌ల అవసరం**

**- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా**

అమరావతి, (చైతన్యరథం): తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధులు ప్రబలడానికి కారణాలపై జోద్‌పూర్‌లోని ఐసీఎమ్మార్ నిపుణులతో అధ్యయనం చేయించాలని సంకల్పించామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో జిల్లా స్థాయిలో నిపుణులతో అధ్యయనం చేయించామన్నారు. అయితే అక్కడ ఈ వ్యాధులకు కారణం నీటి సమస్య కాదని ఇంకేదో కారణాలున్నాయనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారని తెలిపారు. దీంతో ఐసీఎమ్మార్ పుణులతో అధ్యయనం చేయించాలని నిర్ణయించామన్నారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆయన తమ జిల్లాకు సంబంధించిన ప్రగతిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. రానున్న వర్షాకాలంలోపుగానే బుడమేరు వరద మళ్లింపు కాలువలకు పడిన గండ్ల పూడ్చివేత పనులు చేపడతామన్నారు. మున్నేరువాగు గండ్లు మరమ్మతులు చేస్తున్నామన్నారు. జిల్లాలో విజయవాడ ఆటోనగర్ ఆటోమొబైల్ రంగానికి అత్యంత కీలకమైందని, అక్కడ మెకానిక్‌ల కొరత ఎక్కువగా ఉందన్నారు. దాదాపు లక్ష మంది మెకానిక్‌లు ఆటోనగర్‌కు అవసరమని ఈ డిమాండుకు తగ్గ చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో తలసరి ఆదాయం రూ.4.17 లక్షల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## సెప్టెంబరులో చిల్లీ కాంక్లేవ్

**- శీతల గోదాముల్లో 40 లక్షల బస్తాల మిర్చి**

**- గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి**

వచ్చే సెప్టెంబరులో గుంటూరులో చిల్లీ కాంక్లేవ్ పేరిట ఒక పెద్ద సదస్సు నిర్వహిం చనున్నామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలోని శీతల గోదా ముల్లో 40 లక్షల బస్తాల మిర్చి నిల్వ ఉందని, ఎగుమతులకు మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో ధరల కోసం భద్రపరచుకున్నారని తెలిపారు. గుంటూ రు నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహకారం అవసరమని తెలిపారు. గుంటూరు ఛానెల్‌ను రూ.625 కోట్లతో ఆధుని కీకరించాలనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశామని వెల్లడించారు. మల్లాయ పాలెం, చిన్నకాకాని వద్ద ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయడానికి ఇప్పటికే బడ్జెట్ ప్రతిపాదనలు పంపా మని చెప్పారు.

## మ్యాంగో క్లస్టర్ జోన్‌గా విజయనగరం

**బోగాపురం పనులు 70 శాతం పూర్తి**

**విజయనగరం కలెక్టర్ బీఆర్ అంబేద్కర్**

విజయనగరం జిల్లాను మ్యాంగో క్లస్టర్ జోన్ ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నా మని విజయనగరం జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. బోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయని, విమానాశ్రయానికి దగ్గర్లో ఒక ఫైవ్ స్టార్ హోటల్ రాబోతుందని తెలిపారు. విమానాశ్రయం పూర్తయితే నీటి సరఫరాకు తారకరామా ప్రాజెక్టును పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ప్రతి పోలీసుస్టేషన్‌లో ఒక డ్రోన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో ఒక డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పైడితల్లి ఆలయం, రామతీర్థంలను పర్యాటక ఆధ్యాత్మిక క్షేత్రాలుగా అభివృద్ధి చేసి ఆదాయం పెంచుతామన్నారు. గిరిజన విశ్వవిద్యాలయంలో జూన్ నుంచి తరగతు లు ప్రారంభం కానున్నాయని చెప్పారు.

## రొయ్యల చెరువులకు సౌర విద్యుత్తు

**ప్రయోగాత్మకంగా అమలు - ఒక్కో చెరువు వద్ద 14వేల యూనిట్లు ఉత్పత్తికి అవకాశం**

**- కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

అమరావతి, (చైతన్యరథం): ఆక్వా రైతులకు సౌర విద్యుత్తు అందించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలు పరిశీలించడానికి కృష్ణా జిల్లాలో కొన్ని రొయ్యల చెరువులకు సౌర విద్యుత్తు ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ డీకే బాలాజీ వెల్లడించారు. చెరువుకు రెండువైపులా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్తు అందిస్తున్నామన్నారు. ఒక్కో చెరువుకు రెండు వైపులా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయడం ద్వారా 14,400 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ప్రయోగ ఫలితాల ఆధారంగా విశ్లేషణ చేసి జిల్లా అంతటా దీన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన జిల్లాలో ప్రగతి గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణా జిల్లాలో వృద్ధి రేటులో పారిశ్రామిక రంగం వాటా కేవలం 12 శాతం మాత్రమే ఉందన్నారు. పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలంగా ఉన్నప్పటికీ ఇక్కడ భూముల ధరలు సమస్యగా ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి నిబంధనల్లోనూ కొన్ని సడలింపులు అవసరమన్నారు. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం ఒక పరిశ్రమ స్థాపించాలంటే 9 మీటర్ల విస్తీర్ణమున్న రహదారి ఉండాలని, అయితే పంజాబ్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు 6 మీటర్లకే అనుమతులిస్తున్నాయని వాటిని ఆదర్శంగా తీసుకుని ఇక్కడ కూడా నిబంధనలు సడలించే అంశాన్ని పరిశీలించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో వరి ఎక్కువగా సాగు చేస్తున్నారని, ధాన్యం కొనుగోలు సమయంలో తేమ సమస్య కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం డ్రయర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

## టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు ప్రణాళికలు

**పెద్దాపురం వద్ద మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్**

**కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్**

కాకినాడ జిల్లాలో 27 కిలోమీటర్ల మేర సముద్రపు తీరపు కోత నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేవని వివరించారు. సముద్ర తీరం వెంబడి 1246 ఎకరాల ఉప్పు భూములు న్నాయని తెలిపారు. కాకినాడ జీజీహెచ్‌లో 1961 నిర్మించిన ఓపీడీ బ్లాకులు పునర్ని ర్మాణానికి రూ.500 కోట్లు అవసరమని తెలిపారు. పెద్దాపురం వద్ద మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటు కానుంది. అన్నవరం, పిఠాపురం, కాకినాడ హోప్ ఐలాండ్, కోరింగ మడ అడవులను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. 15 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

## పరిశ్రమలకు సిద్ధంగా 4 వేల ఎకరాలు

**పామాయిల్ సాగుకు ప్రోత్సాహం - ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి**

ఏలూరు జిల్లాలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు స్థాపించడానికి ముందుకొచ్చే వారి కోసం 4 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధంగా ఉందని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. వ్యవసాయ, పర్యాటక రంగంలో ఏలూరు జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పామాయిల్ విస్తృతంగా సాగు చేయడానికి ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల ఆలయంతో పాటు జిల్లాలోని మిగిలిన ఆలయాలు, పొరుగు జిల్లాల్లోని దేవీపట్నం గండిపోచమ్మ ఆలయం, పాపికొండలు తదితర ప్రాంతాలు ఉదయం నుంచి సాయంత్రం లోపు చూసి వచ్చేలా ప్రణాళికలు రూపొందించి పర్యాటకులను ఆకర్షిస్తున్నట్లు చెప్పారు. తలసరి ఆ దాయం రూ.4 లక్షలు సాధన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. జిల్లాలో మామి డి రైతులు ఎక్కువగా ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.

## ఎరువుగా గుర్రపుడెక్క ఆకు

**ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహం - పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి**

సాగునీటి కాలువల్లో విస్తారంగా పెరిగే గుర్రపుడెక్క ఆకును ఎరువుగా మార్చే దిశగా కృషి చేస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ దిశగా ముందుకొచ్చే సంస్థలకు ప్రోత్సహించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో సాగునీటి కాలువల్లో గుర్రపుడెక్క ప్రవాహానికి కూడా ఇబ్బందికరంగా ఉంటుందని, సమస్యను పరిష్కరించుకునే అవకాశాలపై దృష్టిపెట్టినట్లు వివరించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ.3.50 లక్షలు లక్ష్యమన్నారు. ఆక్వా రంగంలో గణనీయమైన ప్రగతి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చేపలు, రొయ్యల సాగు 1.33 లక్ష ల ఎకరాల నుంచి 1.50 లక్షల ఎకరాలకు పెంచే దిశగా పనిచేస్తున్నామని వివరిం చారు. జిల్లాలో పశు వైద్యశాలల భవనాలకు మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణానికి సహకారం కావాలని కోరారు.

## జిల్లాల్లో 5 జియో టెక్స్‌టైల్ యూనిట్లు

**కొబ్బరి, అరటి సాగుకు ప్రణాళికలు**

**కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్**

కోనసీమ జిల్లాలో 5 జియో టెక్స్‌టైల్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు. ద్వీపంలో ద్వీపంగా కోనసీమను అభివర్ణిం చారు. 1000 ఎకరాల్లో కోకో, 2 వేల ఎకరాల్లో అదనంగా అరటి సాగులోకి తెచ్చేందు కు ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. కోనసీమ జిల్లా హెరిటేజ్ అండ్ కల్చర్‌కు పెట్టింది పేరు. అనేక దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. సుమారు 15 వేల మందికి పైగా ప్రజలు మధ్య ప్రాచ్య దేశాల్లో పనిచేస్తున్నారు. కొబ్బరి, అరటి, కోకో తదితర వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు వ్యాల్యూ ఎడిసన్ తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

## తలసరి ఆదాయం పెంపునకు చర్యలు

**ప్రభుత్వ ఉద్యోగులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ**

**శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్**

శ్రీకాకుళం జిల్లాలో కెమికల్ ఇంజినీర్లకు విపరీతమైన డిమాండ్ ఉందని శ్రీకా కుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. ఫార్మా రంగంలో జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తలసరి ఆదా యం రూ.1.85 లక్షలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

జిల్లాలో అరసవల్లి, శ్రీకూర్మం పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలుగా ఉన్నాయని, పర్యాటకరంగం పరంగా కూడా జిల్లాను అభివృద్ధి చేయనున్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ కూడా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టూల్స్ ఉపయోగించడంపై ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి 200 మంది ఉద్యోగులకు ఈ శిక్షణ అందించనున్నామని వివరించారు.

## 213 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం

**రాజమండ్రిలో అంతర్జాతీయ పుష్ప ప్రదర్శన**

**తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి**

జిల్లాలో 213 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చర్యలు తీసుకుంటున్నామని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. 15 డ్రోన్లు సాగులో ఉపయోగిస్తున్నామని, రోజుకు 600 నుంచి 700 ఎకరాలు కవర్ చేస్తూ రోజుకు 12 నుంచి 15 ఎకరాలు స్ప్రే చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కొత్తగా 5000 డైరీ యూనిట్లు ఏర్పాటుకు ప్రణాళిక చేశాం. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసు కుంటున్నామని వివరించారు. త్వరలో జియో బయో ఫ్యూయల్ యూనిట్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పా రు. జిల్లాలో 10 ఆర్వోబీలు మంజూరు కాగా త్వరితగతిన భూసేకరణ చేయనున్నాం. రాజమండ్రిలో రెండు 5 స్టార్ హోటళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజమండ్రిలో ఆగస్టులో అంతర్జాతీయ పుష్ప ప్రదర్శన ఉత్సవాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేశామని, కొవ్వూరు నుంచి పోలవరం వరకు జాతీయ రహదారి మంజూరైనట్లు చెప్పారు.




సూపర్ స్టార్ కృష్ణ సోదరుడు, ప్రముఖ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు మనవడు, మనవరాలి (ట్విన్స్) బారసాలకు హాజరైన సీఎం చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్. తాడేపల్లిలోని పార్క్ విల్లాలో ఏర్పాటు చేసిన బారసాలకు హాజరైన చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు పలువురు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారాల ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆహ్వానం పలుకుతున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్ జైన్.

# ఎర్రకాలువ ముంపు రైతాంగానికి శుభవార్త

**- ఇన్‌పుట్ సబ్సిడీకి సీఎం ఆదేశం**

**- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**

అమరావతి(చైతన్యరథం): నిడదవోలు ఎర్రకాలువ ముంపు వల్ల నష్టపోయిన రైతాంగానికి మంత్రి కందుల దుర్గేష్ శుభవార్త చెప్పారు. బుధవారం కలెక్టర్ల సదస్సులో ఆర్థిక శాఖ అధికారులను పిలిచి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారని, అందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 2024 జూలై నెలలో సంభవించిన భారీ వర్షాలు, విపత్తు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికే ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించినట్లు చెప్పారు. రెండు మూడు పర్యాయాలు కేబినెట్‌లో చర్చించారని, సీఎం సైతం విడుదలకు సుముఖంగా ఉన్నారని చెప్పారు. కలెక్టర్ల సదస్సులో ఇన్‌పుట్ సబ్సిడీ అంశం ప్రస్తావనకు రాగా ఆర్థిక శాఖ అధికారులను పిలిచి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

# 31వరకే తొలి ఫ్రీ సిలిండర్ ఛాన్స్

**పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్**

అమరావతి (చైతన్య రథం): దీపం-2 పథకంలో భాగంగా తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ అందుకునే లబ్దిదారులకు మార్చి 31 వరకే అవకాశం ఉందని, ఇప్పటివరకు సిలిండర్ పొందనివారు వెంటనే బుక్ చేసుకోవాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్న హామీ మేరకు కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 98 లక్షలమంది తొలి ఉచిత గ్యాస్ సిలిండర్లు వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏపీలో సూపర్ సిక్స్ హామీని కూటమి సర్కార్ నిలబెట్టుకుంటోందన్నారు. ఉచిత సిలిండర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటలలోపు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 48 గంటలలోపు గ్యాస్ డెలివరీ చేస్తారని పౌరసరఫరాల మంత్రి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్దిదారుల ఖాతాల్లో తిరిగి జమ చేస్తున్నట్లు చెప్పారు. ఏడాదిలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. ఎటువంటి సమాచార లోపమున్నా టోల్ ఫ్రీ నెం.1967కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు.

# విశాఖలో లులూ మాల్

**భూ కేటాయింపునకు ప్రభుత్వం ఆదేశం**

అమరావతి (చైతన్య రథం): విశాఖలో లులూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏపీఐఐసీ ద్వారా లులూ గ్రూపునకు విశాఖలో భూకేటాయింపులు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ఆదేశాలు జారీ చేసింది. లులూ గ్రూప్ సంస్థ విశాఖ నగరంలో అంతర్జాతీయ స్థాయి మాల్ నిర్మాణం పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్లు పరిశ్రమల శాఖ వెల్లడించింది. 2017లో విశాఖ బీచ్ రోడ్డులోని హార్బర్ పార్క్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు లులూ గ్రూప్ ముందుకొచ్చింది. 2023లో లులూ గ్రూప్‌నకు చేసిన భూకేటాయింపులను వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం మళ్లీ షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణం కోసం లులూ గ్రూప్ ముందుకొచ్చింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించి భూకేటాయింపులు చేయాల్సిందిగా ఏపీఐఐసీని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆదేశించారు.

## 5000 హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం

**చేనేత క్లస్టర్ల ఏర్పాట్లుకు చర్యలు**

**శ్రీ సత్యసాయి కలెక్టర్ చేతన్**

వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలలో 13.57% వృద్ధి రేటు సాధించే దిశగా ప్రణాళికలు చేసినట్లు శ్రీ సత్యసాయి కలెక్టర్ చేతన్ తెలిపారు. 5000 హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. చేనేతకు సంబంధించి సోమందేపల్లి, హిందూపూర్‌లో ఒక చిన్న డెవలప్‌మెంట్ క్లస్టర్, ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీబీఆర్, గొల్లపల్లి రిజర్వాయర్‌లో చేపల విత్తనశాలను ఏర్పాటు చేసి నాణ్యమైన చేప పిల్లలను అందించ నున్నట్లు తెలిపారు. 2 సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## విండ్ పవర్ ప్రాజెక్టుకు చర్యలు

**- ఓర్వకల్లు మీదుగా కొత్త రైల్వేలైన్**

**- కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా**

జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలలో ఉత్పాదకతను పెంపొందించే దిశగా ప్రణాళికలు చేసినట్లు కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 ప్రభుత్వ చేపల విత్తన పెంపక శాలలను పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. కోసిగి, ఆదోని, చిప్పగిరి మరియు గూడూరు మండలాలలో ఉన్న 631 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చేపల పెంపకాన్ని 1000 ఎకరాలకు పెంచేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా 44 ఖనిజ ప్రాంతాలను గుర్తించామని, వాటి ద్వారా జిల్లాకు మరింత ఆదాయం పెరిగే సూచనలు ఉన్నట్లు తెలిపారు. ఒక కొత్త విండ్ పవర్ ప్రాజెక్టును నెలకొల్పనున్నట్లు తెలిపారు. పంప్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి అవకాశాలు కలగించనున్నట్లు తెలిపారు. ఓర్వకల్లు మీదుగా దూపాడు నుంచి పాణ్యం వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## వ్యవసాయంలో వృద్ధిరేటు 18.32% లక్ష్యం

**అరటి, ఆరంజ్, ఉల్లి, పసుపు క్లస్టర్లు**

**కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్**

వ్యవసాయ, అనుబంధ రంగాలలో వృద్ధి రేటు 18.32% లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామని కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వివరించారు. 13000 హెక్టార్లలో తృణ ధాన్యాలు, రాగి పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 10012 హెక్టార్లలో అరటి, స్వీట్ ఆరంజ్, ఉల్లిపాయ, పసుపు పంటలను 4 క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్లాక్ చేయబడిన 12 లైమ్స్టోన్, ఇతర గనులకు తిరిగి లైసెన్స్ పునరుద్ధరించడం, కడపలో 3000 ఇళ్లకు సరిపడా కొత్త గ్యాస్ స్టేషన్‌ను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఒక కుటుంబం..ఒక పారిశ్రామికవేత్త కింద గ్రామీణ ప్రాంతంలో 21,456, పట్టణ ప్రాంతంలో 7012 మందిని గుర్తించామన్నారు. జిల్లా జీడీవీఏ-17.57%, జీడీడీపీ-18.16%, పర్ క్యాపిటా ఇన్‌కమ్- 17.86% సాధించే లా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## డోలీల రహిత జిల్లాగా మన్యం

**కంది, నిమ్మగడ్డి సాగుకు ప్రోత్సాహం**

**పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్**

పార్వతీపురం మన్యం జిల్లాను డోలీల రహిత జిల్లాగా మార్చడానికి ప్రణాళికాబద్ధం గా పనిచేస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. అర కు కాఫీకి బ్రాండ్ ఇమేజ్ వచ్చిందని, జీడిపప్పు సాగును ప్రోత్సహించి దానికి బ్రాండ్ వచ్చేలా చేస్తామన్నారు. కంది, నిమ్మగడ్డి, అపరాల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పా రు. జిల్లాలో ఎనీమియాను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కంటైనర్లలో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లా తలసరి ఆదాయం రూ.1.67 లక్షలుగా ఉండగా దాన్ని వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.94 లక్షలకు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణా ళికలు రచించామన్నారు. జిల్లాలో ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణ పనులు 60 శాతం పూర్తి కావచ్చాయని తెలిపారు.

చైతన్యరథం

# వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి భూకబ్జా

## న్యాయం చేయాలని బాధితుడి ఫిర్యాదు - ప్రజావినతుల్లో నాయకులకు గోడు





మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో వైసీపీ నాయకుల ఆగడాలు, భూకబ్జాలపై ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కళింగ వెల్ఫేర్, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణంనాయుడు వినతులు స్వీకరించారు. వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఇతరుల ఆర్ఎస్ఆర్ భూమి అయిన సర్వే నెంబర్ 56/1లోని 5 ఎకరాల పొలం అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నాడని ఫిర్యాదు అందింది. అందులో అర ఎకరా టీటీడీకి రిజిస్టర్ చేసి అందులో టీటీడీ కళ్యాణ మండపం నిర్మించి బిల్లు చేసుకున్నాడని, మిగతా 5 ఎకరాలు భార్య పేరు మీద రాయించుకుని అనుభవిస్తున్నాడని అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం మేకవారిపల్లె గ్రామానికి చెందిన గన్నె సుబ్బ నర్సయ్యనాయుడు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపి న్యాయం చేయాలంటూ కోరారు.

జగన్ హయాంలో నిలిపివేసిన పెన్షన్‌ను తిరిగి పునరుద్ధరించాలంటూ బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం వెటపాలెం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన చల్లా ఏకాంబరం మొరపెట్టుకున్నారు.

గత నెల 27న మహాశివరాత్రి రోజు శ్రీశైలం డ్యామ్‌లో పడి చనిపోయిన వారితో పాటు పలువురు తమకు చంద్రన్న బీమా పథకాన్ని అందించాలని వినతిపత్రం ఇచ్చారు.

మహేశ్వరి రియల్ ఎస్టేట్‌కు చెందిన టి.తమ్మినేని ప్రభాకర్‌నాయుడు స్థలం కొనుగోలు నిమిత్తం తాము డబ్బులు చెల్లించినా స్థలం ఇవ్వలేదని తిరుపతి అవిలాల రూరల్ చంద్రగిరి మండలానికి చెందిన మాదినేని పెద్దరెడ్డయ్య, మాదినేని లక్ష్మీదేవిలు మొరపెట్టుకున్నారు. నెలనెలా కంతుల ప్రకారం లక్షలాది రూపాయలు కట్టించుకుని స్థలమివ్వమని అడిగితే తమపై దాడికి దిగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

వికలాంగుల కోటాలో తమకు ప్రభుత్వం ఇచ్చిన గృహంలో నివసించడానికి తహ సీల్దారు అడ్డుకుంటున్నాడని కృష్ణా జిల్లా తలపిల్లి గ్రామంలోని కృష్ణాపురం దివ్యాంగుల కాలనీకి చెందిన చింతలచెరువు సుధాకర్‌రావు ఆవేదన వ్యక్తం చేశాడు. తన ఇంటిలోకి వెళ్లనివ్వకపోవడంతో బయట పడుకుంటున్నామని తెలిపాడు. దివ్యాంగుల కోటా కింద ఇచ్చిన ఇంటిపై తమకు హక్కు కల్పించాలని వేడుకున్నారు.

ప్రభుత్వం కేటాయించిన స్థలంలో మసీదు నిర్మించుకుంటుంటే వైసీపీకి చెందిన కొందరు నాయకులు తమపై దాడి చేసి పోలీసుస్టేషన్‌లో తప్పుడు కేసులు బనాయించి మసీదు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరుకు చెందిన ముస్లింలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మసీదు నిర్మాణానికి ఇచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించి నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని కోరారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో లేని పొలాన్ని తన పేరున ఉన్నట్లు వీఆర్వో 5 ఎకరాల 60 సెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించారని, ఆ పొలాన్ని తన పేరు నుంచి తొలగిం చాలని కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన శేషారత్నకుమారి వాపోయారు. ఆన్‌లైన్‌లో తన పేరున భూమి ఉండడంతో రేషన్ కార్డు మీద వచ్చే పథకాలు ఇవ్వడం లేదని మొరపెట్టుకున్నారు.







## నేడు విజయవాడలో రాష్ట్రస్థాయి ఇఫ్తార్

- ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు
- ఏర్పాట్లపై చర్చించిన మంత్రి ఫరూక్



అమరావతి (చైతన్యరథం): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విజయ వాడ ఎంజీ రోడ్డులోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించే రాష్ట్రస్థాయి ఇఫ్తార్ కార్యక్రమాన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు న్యాయ, మైనార్టీ సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. బుధవారం ఇఫ్తార్ వేదిక ఏ ప్లస్ కన్వెన్షన్ వద్ద మైనారిటీ సంక్షేమ శాఖ సీఈఓ శ్రీధర్, ఎన్టీఆర్ కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులతో రాష్ట్రస్థాయి ఇఫ్తార్‌కు సంబంధించి ఏర్పాట్లపై చర్చించారు. పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల స్థాయిలో ఇఫ్తార్ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింద ని, ఇందుకోసం రూ.1.50 కోట్లు నిధులను విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం, ముఖ్య శాఖల సిబ్బంది సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి ఇఫ్తార్‌కు ముఖ్యఅతిథిగా ముఖ్య మంత్రి చంద్రబాబు హాజరవుతారని వెల్లడించారు. అన్ని జిల్లాల్లో కూడా జిల్లా స్థాయి ఇఫ్తార్ ఏర్పాట్లు సంబంధించి కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడం జరిగింద న్నారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు సంబంధించి గత ప్రభుత్వం నిలిపివేసిన ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. క్రిస్టియన్ మైనా ర్టీలకు సంబంధించి కూడా పాస్టర్ల వేతనాలకు ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేసిందని తెలిపారు.

## ఏపీలో పెట్టుబడులు పెట్టండి

### వనరులు, అవకాశాలు వినియోగించుకోండి - జపాన్ కంపెనీలతో మంత్రి టి.జి.భరత్

విజయవాడ(చైతన్యరథం): నగరంలోని నోవాటెల్‌లో ఆంధ్రప్రదేశ్‌తో జపాన్ అను సంధానం పేరుతో కార్యక్రమం బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పాల్గొన్నారు. భారత్‌లో జపాన్ రాయబారి ఓనో కొయిచ్చి హాజరయ్యారు. ఇన్వెస్ట్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పీపుల్ టూ పీపుల్ ఎక్స్ఛేంజ్ అండ్ ఎడ్యుకేషన్‌పై సెమినార్ జరిగింది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని జపాన్ కంపెనీల ప్రతినిధులను మంత్రి కోరారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అనువైన ప్రాంతంగా పేర్కొన్నారు. సీఎం చంద్ర బాబు ముందుచూపుతో హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకు వెళుతున్నామని, పెట్టుబడులు పెట్టే వారికి అన్ని విధాలా తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. తొమ్మిది నెల ల్లోనే 8.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి తీసుకువచ్చామని తెలిపారు. పెండింగ్ ఇన్సెం టివ్స్ ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నామని వివరించారు.



సీబీఎన్ బ్రాండ్‌తో పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగిస్తున్నాం..ఇండియాలో ఎక్కడా లేని విధంగా ఎస్క్రో మెకానిజంను ఏపీ లో తీసుకొస్తున్నాం..అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టవచ్చు..ఇక్కడ ఉన్న వనరులు, అవకాశాలు సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు పెట్టాలని కోరారు.

## వచ్చే నెలలో 'మన ఇంటికి మన మిత్ర'

### - వాట్సాప్ సేవలపై అవగాహనకు శ్రీకారం

అమరావతి(చైతన్యరథం): ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించడానికి ఏప్రిల్ నెలలో 'ప్రతి ఇంటికి మనమిత్ర' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి స్మార్ట్ ఫోన్‌లలో 9552300009 నెంబర్‌ను సేవ్ చేసి సేవల గురించి వివరిస్తారని ఐటీ/ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ వెల్లడించారు. ప్రస్తుతం 210 సేవలు అందుతున్నాయని చెప్పారు. అన్ని రకాల ధ్రువపత్రాలను వాట్సాప్‌లోనే అందిస్తామని తెలిపారు.



## వి.ఎం.ఆర్.డి.ఎకి చెందిన దుకాణాల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి



విశాఖపట్నం (చైతన్యరథం): వి.ఎం.ఆర్.డి.ఎకి చెందిన దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో తప్పనిసరిగా అగ్ని మాపక పరికరాలు అమర్చాలని వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ అదేశించారు. బుధవారం ఉదయం సెంట్రల్ పార్క్ ఎదురుగా వి.ఎం.ఆర్.డి.ఎకి చెందిన షాప్ 14లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, వి.ఎం.ఆర్.డి.ఎ కార్యదర్శి మురళీ కృష్ణ, కార్యనిర్వాహక ఇంజనీర్ రామరాజుతో కలిసి సందర్శించారు. ప్రమాద తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ఇకపై వి.ఎం.ఆర్.డి.ఎకి చెందిన అన్ని షాప్‌ల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యాటక ప్రదేశాల్లో ఉన్న షాపుల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అన్నింటిలో అగ్నిమాపక పరికరాలు ఎట్టిపరిస్థితుల్లో ఉంచాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నోటీసులు జారీ చేసి జరిమానా విధించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## చుక్కలు చూపిస్తున్న సూరీడు... పాఠశాలల్లో వాటర్ బెల్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం



తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం తొమ్మిది దాటితే చాలు.. ఎండవేడిమికి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెండు రాష్ట్రాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్నారు. ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు ఉక్కపోతతో చుక్కలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే.. ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు వర్షాలు కురిశాయి.. దీంతో కాస్త ఉపశమనం కలిగినట్లయింది.. భిన్న వాతావరణ పరిస్థితుల మధ్య.. వాతావరణ శాఖ కీలక ప్రకటన జారీ చేసింది. ఇవ్వాల్టి నుంచి భానుడు మరింత ప్రతాపం చూపిస్తాడని పేర్కొంది. నేడు 108 మండలాల్లో తీవ్రవాడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. బుధవారం శ్రీకాకుళం జిల్లా -15, విజయనగరం జిల్లా-21, పార్వతీపురంమన్యం జిల్లా-10, అల్లూరి సీతారామరాజు జిల్లా-8, అనకాపల్లి-7, కాకినాడ-7, కోనసీమ-3, తూర్పుగోదావరి-13, ఏలూరు-5, కృష్ణా -2 ఎన్టీఆర్-6, గుంటూరు-3, పల్నాడు-8 మండలాల్లో వడగాల్పులు (108) ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. గురువారం 33 మండలాల్లో తీవ్రవడగాల్పులు..206 మండలాల్లో వడగాల్పులు వీచేందుకు అవకాశం ఉందని పేర్కొంది. కాగా.. మంగళవారం నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.6, ప్రకాశం జిల్లా దరిమడుగులో 41.1, నెల్లూరు జిల్లా సోమశిలలో 40.9, అన్నమయ్య జిల్లా పూతనవారిపల్లి, చిత్తూరు జిల్లా పిపల్లి, వైఎస్సార్ జిల్లా అట్లూరులో 40.1, తిరుపతి జిల్లా రేణిగుంటలో 40 చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.. అలాగే 15 మండలాల్లో వడగాల్పులు వీచాయి. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా బయటకు వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేసింది వాతావరణ శాఖ.

### నేటి నుంచి అన్ని పాఠశాలల్లో వాటర్ బెల్ అమలు

గత వేసవి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వేడి ప్రభావం కనిపించింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యార్థులు డీహైడ్రేషన్, అలసట, తలనొప్పి, ఒంటినొప్పి వంటి సమస్యలకు గురయ్యారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎండల వల్ల కలిగే అనారోగ్యాలను నివారించేందుకు పాఠశాలల్లో 'వాటర్ బెల్' కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో భాగంగా క్లాసెస్ మధ్యలో ప్రత్యేక బెల్ మోగించి విద్యార్థులకు నీరు తాగే అవకాశం కల్పించనున్నారు. పాఠశాలల్లో ఉదయం 10 గంటలకు మొదటి వాటర్ బెల్ మోగుతుంది. ఈ సమయంలో ఉపాధ్యాయులు తరగతులను కాసేపు ఆపి, విద్యార్థులను నీరు తాగమని ప్రోత్సహిస్తారు. మరోసారి 11 గంటలకు, మూడోసారి మధ్యాహ్నం 12 గంటలకు వాటర్ బెల్ మోగుతుంది. ప్రతి బెల్ తర్వాత విద్యార్థులు నీరు తాగడానికి రెండు మూడు నిమిషాల సమయం ఉంటుంది. వాటర్ బెల్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం కోసం పాఠశాలలకు కొన్ని ముఖ్యమైన బాధ్యతలు అప్పగించారు. ప్రతి పాఠశాలలో తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలి. అవసరమైన చోట ఆర్.ఓ. ప్లాంట్లు, వాటర్ కూలర్లు లేదా మట్టి కుండలు ఏర్పాటు చేయాలి. నీటి లభ్యతను పర్యవేక్షించి రోజుకు ఒక్కసారి శుభ్రమైన నీటిని నింపడం తప్పనిసరి. ప్రతి తరగతి గదిలో "ప్రతి గంటకోసారి నీరు తాగండి – ఆరోగ్యంగా ఉండండి" అనే నినాదాలతో పోస్టర్లు పెట్టాలని సూచించారు. విద్యార్థులు నీటి బాటిళ్లు తెచ్చుకునేందుకు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. నీటి కొరత లేకుండా నిరంతరం నీరు అందుబాటులో ఉంచే బాధ్యత హెడ్‌మాస్టర్లదేనని ఆదేశాలు జారీ చేసింది.



## ప్రజల అభిమతాన్ని గౌరవిస్తున్నాం : సుజయ్ కృష్ణరంగారావు

బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావుపై అవిశ్వాస తీర్మానం పెట్టే అంశంపై మాజీ మంత్రి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆర్వీ సుజయ్ కృష్ణరంగారావు స్పష్టత ఇచ్చారు. బొబ్బిలి కోటలోని తన నివాసంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రజల అభిమతాన్ని గౌరవిస్తున్నాం.. బొబ్బిలి మున్సిపాలిటీ పాలకపక్షాన్ని మార్చాల్సిన తరుణం ఆసన్నమైందని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఆనాడు స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎలా నిర్వహించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. నాలుగేళ్లుగా అసమర్థ, అవినీతి పాలన సాగిందని వైసీపీకి చెందిన కౌన్సిలర్లే ఆరోపణలు గుప్పిస్తున్నారన్నారు. చైర్మన్ పదవికి అనర్హుడని వారే అంటున్నారని చెప్పారు. వైసీపీ కౌన్సిలర్లంతా ఇలా ముందుకు రావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : మామిడి గోవిందరావు

హిరమండలం (చైతన్యరథం): మత్స్యకారుల సంక్షమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం వంశధార రిజర్వాయర్‌లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా వివిధ రకాల 4,856 లక్షల చేప పిల్లలను విడిచి పెట్టారు. మత్స్యకారుల జీవనోపాధికి చేపపిల్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి పీవీ శ్రీనివాసరావు, ఏడీ వైవీ సత్యనారాయణ, ఎఫ్‌డీవో ఎస్ ముసలినాయుడు, టీడీపీ నేతలు యాళ్ల నాగేశ్వరరావు, తూలుగు తిరుపతి రావు, సర్పంచ్ లంక రోజారాణి, ఎంపీటీసీ చింతాడ బుడు పాల్గొన్నారు.



## కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయాలని సదుద్దేశంతో బుధవారం కురుపాం మండలం, మొండెంఖల్లు గ్రామంలో మండల కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలతో నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను, పలు అంశాలు గురించి చర్చించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని జగదీశ్వరి కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొండయ్య, నాయకులు కోలా రంజిత్ కుమార్, భారతమ్మ, సుబ్బలక్ష్మి, రంజిత్ కుమార్ నాయకో, రమణమూర్తి, లోకనాథం, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

### •ఎమ్మెల్యే శిరీష విజయ భాస్కర్ వెల్లడి



రంపచోడవరం (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్, మఠం విజయభాస్కర్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పలు ప్రాంతాల ప్రజలు వచ్చి వారి సమస్యలను ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్‌కి వినతులు నేరుగా అందించారు. ఈ సందర్భంగా శిరీష విజయభాస్కర్ మాట్లాడుతూ... ఇకనుంచి ప్రతి బుధవారం ప్రజా సమస్యలపై ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. నేటి ప్రజా దర్బార్ లో 41 వినతులు రాగా ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపుతామని పేర్కొన్నారు. అదేవిధంగా ఇకనుంచి ప్రజా సమస్యలపై వచ్చే ప్రతి దరఖాస్తుదారులు వారి యొక్క దరఖాస్తుకీ వారి యొక్క ఆధార్ కార్డు జోడించి తీసుకుని రావాలని కోరారు. ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామస్తులు రోడ్డు సౌకర్యం, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, పట్టుచీర గ్రామంలో నూతన అంగన్వాడి భవన నిర్మాణం చేపట్టాలని, రంపచోడవరం మండలం దబ్బ వలస గ్రామస్తులు రేషన్ డిపోను మంజూరు చేయాలని, వి ఆర్ పురం గ్రామానికి చెందిన ముత్యాల లక్ష్మి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కావాలని, పెద్ద గెద్దాడ గ్రామస్తులు చెక్ డ్యాం నిర్మాణం ఇలా పలు సమస్యలపై వినతులను అందిచారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, రంపచోడవరం మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, ఎటపాక టీడీపీ మండలం అద్యక్షులు పుట్టి రమేష్,మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు,వై నిరంజనీదేవి, బాపన్న దొర తదితరులు ఉన్నారు.

## గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర



పార్వతీపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గ్రీవెన్స్ కార్యక్రమం ఎమ్మెల్యే విజయ్ చంద్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలతో మమేకమయ్యారు ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి యొక్క సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఇచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు.

# కార్యకర్తే అధినేత... ఇదీ టీడీపీ నినాదం

**●ఆ మాటను ఆచరణలో పెట్టేందుకు సత్వర కృషి : బండారు**




కొత్తపేట (చైతన్యరథం): కార్యకర్తే అధినేత అనేది తెలుగుదేశంపార్టీ నినాదం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డిలతో కలిసి పార్టీ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ... పార్టీ అధిష్టానం ఇచ్చిన మాట మేరకు కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి బుధవారం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఈ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు గుర్తుచేశారు. కార్యకర్తే అధినేత అనే మాటలను తెలుగుదేశం పార్టీ ఆచరణలో పెడుతోందని ఇకపై ప్రతి కార్యకర్తను కలిసి సమస్యలు పరిష్కరించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంచలన నిర్ణయం తీసుకున్నారన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశానికి ఉందన్నారు. ఇటీవల కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించి అతిపెద్ద కుటుంబంగా మారిన నేపథ్యంలో కార్యకర్తే అధినేత అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారని, ఈ మేరకు అన్ని నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారికి అండగా నిలుస్తామని సమస్యలు పరిష్కరించాలని పార్టీ నాయకులు, శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారని వివరించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లతో పాటు బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ ఫీల్డ్ వర్క్, శంఖారావం ఫీల్డ్ వర్క్, ఓటర్ వెరిఫికేషన్, పార్టీ యాప్స్, సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలను మరోసారి అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలు ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తామని తెలిపారు. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రతీ కార్యకర్తను అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసమే కార్యకర్త అధినేత కార్యక్రమం : వర్మ



పిఠాపురం (చైతన్యరథం): ప్రతి బుధవారం నియోజకవర్గంలో కార్యకర్తల, ప్రజల సమస్యలు పరిష్కారానికి సమావేశమై అర్జీలు స్వీకరించడం, ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలను అభినందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న "కార్యకర్తే అధినేత" కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఎస్వీ.ఎస్.ఎస్ వర్మ వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో నష్టపోయిన కార్యకర్తలకు తగిన న్యాయం చేసేందుకే పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని రూపొందించారని అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే వర్మ స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తే అధినేత కార్యక్రమంలో కార్యకర్తల నుంచి 100 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వర్మ మాట్లాడుతూ...వైసీపీ పాలనలో అక్రమంగా నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని, 2014-19 సమయంలో గృహ నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని, వైసీపీ పాలనలో టీడీపీకి చెందిన లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు కేటాయించకపోవడం, పార్టీ అధికారంలోకి వచ్చినా అధికారులతో కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రపంచంలోనే కోటి మంది సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని, ఏ పార్టీకి కూడా ఇంత మంది సభ్యత్వం కలిగి లేరని, కోటి మంది వన్నెమూక తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. మొట్టమొదటి సారిగా కార్యకర్తలకు ఇన్సూరెన్స్ కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు. యువగళం పాదయాత్రతో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.

# మంచి ప్రభుత్వం వచ్చింది ప్రజలకు మంచే చేస్తుంది

**●చేతివృత్తులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తుందన్న ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): మంచి ప్రభుత్వం వచ్చిందని, ప్రజలకు మంచే చేస్తుందని, చేతివృత్తులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందిస్తూ, చేతివృత్తులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న బిసి సోదరులకు వారి జీవన ఉపాధికి కావలసిన పనిముట్లను అందించడం వలన వారికి ఆర్థికంగా తోడ్పాటు అవుతుందని, రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. కడియం మండల పరిషత్ కార్యాలయం నందు ఎం.పీ.పీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆదరణ-3 అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా గోరంట్ల హాజరయ్యారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... ఆనాటి తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం పేరుతో వివిధ కుల వృత్తుల వారికి అనేక రకాల పనిముట్లను అందించామని, గత ప్రభుత్వం ఈ పథకాన్ని తుంగలో తొక్కి ప్రజలకు ఇవ్వవలసిన పనిముట్లను గోదాములకే పరిమితం చేసి తుప్పు పట్టి పాడైపోయేలా చేసిందని, కుట్టు మిషన్లు సైకిళ్లు అనేక రకాల పనిముట్లు కంప్యూటర్లను కూడా నాశనం చేశారని తెలిపారు. సమావేశానికి విచ్చేసిన నాయకులందరూ ఏ వృత్తుల వారికి ఏ ఏ పరికరాలు అవసరం అవుతాయో అధికారులకు తెలపాలని, వారికి ఉపాధి పెంచే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని నాణ్యమైన పనిముట్లు అందించే విధంగా కార్యచరణ జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారికి కులమతాలు, పార్టీలు చూడకుండా పనిముట్లు అందించి, పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే.రమేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి గోవింద్, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస్, సర్పంచులు మోసగంటి సత్యవతి, చెక్కపల్లి మురళీకృష్ణ, పాటంశెట్టి రాంజీ, ప్రత్తిపాటి రామారావు చౌదరి, గట్టి సుబ్బారావు, నాగిరెడ్డి రామకృష్ణ, పాతూరి రాజేష్, ముమ్మిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



పామర్రు నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో పాల్గొని భాదితుల నుండి నియోజకవర్గ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గన్నవరం నియోజకవర్గ అభివృద్ధే ఏకైక లక్ష్యం : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నానని, గన్నవరం ముఖచిత్రం మార్చే విధంగా చర్యలు చేపడుతున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం ఆలయ పాలకవర్గం నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదికను ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల శాసనసభలో తాను ప్రసంగిస్తూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లాలోని పి.ఎ.సి.ఎస్‌ల పరిధిలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని దీనిపై ఎంక్వయిరీ చేసి రైతుల సొమ్మును అక్రమంగా కాజేసిన వారిని శిక్షించాలని సంబంధిత మంత్రిని కోరగా, ఒక వర్గం మీడియా దీనిని సైతం వక్రీకరిస్తూ వార్తలను చిత్రీకరిస్తున్నారని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. తన సొంత కంపెనీ కంటే ఎక్కువగా భావించి గతంలో తాను చైర్మన్‌గా పనిచేసిన కేడీసీసీ బ్యాంకును ఉన్నత స్థాయిలో నిలిపితే తనను విధుల నుంచి తప్పించి పెద్ద ఎత్తున అవినీతికి తెరలేపారని మరోసారి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 1962వ సంవత్సరంలో మహానుభావులు పుచ్చలపల్లి సుందరయ్య అధికారంలోకి వచ్చి ఉండుంటే గన్నవరం నియోజకవర్గం అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరి ఉండేదని అది జరగకపోవడం గన్నవరం ప్రజల దురదృష్టం అని తెలిపారు. అనంతరం గన్నవరం శాసనసభ్యులుగా వచ్చిన చాలా మంది నాయకులు చిన్న చిన్న పంచాయతీలలో సైతం ఏర్పాటు చేసి గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిలో తమ మార్కు చూపించారని ఎప్పుడూ కూడా మట్టి జోలికి వెళ్లలేదని కానీ గత పది సంవత్సరాలు గన్నవరం నియోజకవర్గం అంటే మట్టే అనే విధంగా భావించి పెద్ద ఎత్తున అక్రమాలకు తెర లేపరని అన్నారు. తాను రాజకీయ జీవితంలో ఎప్పుడూ రాజీ పడలేదని రాబోయే కాలంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నికల ముందు తాను ప్రకటించిన సూపర్ సిక్స్ ను సాధించే క్రమంలో మల్లవల్లి పారిశ్రామిక కారిడార్ మీద దృష్టి సారించి అశోక్ లేలాండ్ కంపెనీని వెనక్కి తీసుకు వచ్చినట్లు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం, రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం దృష్టికి తెలిపానని, త్వరలోనే వాటిని ఏర్పాటు చేసి రైతులకు సౌలభ్యం కల్పిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ : చదలవాడ

నరసరావుపేట (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లక్ష్యమని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలో పలు స్థలా వివాదాలపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా, చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే వీటిపై విచారణ చేసి, కబ్జాకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పింఛన్లు, రేషనకార్డులతో ప్రజలు అధిక సంఖ్యలో వినతులు అందించారు. ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు విన్నవించారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే చదలవాడ అక్కడిక్కడే పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ... వైసీపీ నేతల భూ అక్రమాలు భారీగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం ప్రజల కోసం ఆలోచిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోందన్నారు. కళ్లుండి చూడలేని నాయకుడు జగన్మోహనరెడ్డి అన్నారు. సంక్షేమమే అభివృద్ధిగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం : నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): అమర్తలూరు మండలం కూచిపూడి లాకులు వద్ద బుధవారం ఇరిగేషన్ మరియు డ్రైనేజీ అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ రైతులతో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... రాబోయే ఖరీఫ్ సీజన్‌కు చివరి ఎకరా వరకు నీరు అందించే ఏర్పాట్లు చేయాలని, అందుకు సంబంధించి కాలువలపై ఏదైనా పనులు ఉంటే కనుక అంచనాలు సిద్ధం చేసి పంపించాలని కోరారు. వేసవి కాలం ముగిసే వరకు పనులు మొత్తం పూర్తి కావాలని, రైతు సోదరుల నుంచి వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయాన్ని పూర్తి నిర్లక్ష్యం చేశారని ఫలితంగా రైతులు పెద్దఎత్తున నష్టపోయారని, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు ధాన్యం బకాయిలు చెల్లించకుండా మోసం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సకాలంలో విత్తనాలు సరఫరా చేయడంతో పాటుగా ఎరువులు సకాలంలో ఉంచడం జరిగిందన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలు చెల్లించడం జరిగిందన్నారు. కూటమి పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, రాబోయే రోజుల్లో వ్యవసాయంలో వినూత్న మార్పులు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని నక్కా ఆనంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ మరియు డ్రైనేజీ అధికారులు, వేమూరు నియోజకవర్గం లోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గత పాలకుల వైఫల్యం కారణంగానే... వెల్లువలా ప్రజా సమస్యలు

**●గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో "ప్రజా గ్రీవెన్స్ డే" నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): అవినీతి, కక్ష పూరిత రాజకీయాలతో గత వైసీపీ ప్రభుత్వం, స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులు కాలం గడిపేసారని ఫలితంగా నేడు ప్రజల నుండి సమస్యలు వెల్లువెత్తుతున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి బుధవారం నాడు ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ గ్రీవెన్స్‌కు ప్రజలు మరియు తెలుగుదేశంపార్టీ నేతలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అభివృద్ధి మరియు సంక్షేమాన్ని అందించాలన్న లక్ష్యంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజలకు ప్రభుత్వాన్ని మరియు సేవలను మరింత చేరువ చేయటానికి ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో అనేక సేవలను అందిస్తుంది. ఈ రోజు మరో ముందడుగు వేసి ప్రతి బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ ఆదేశించటాన్ని నేను స్వాగతిస్తున్నాను. ఇప్పటికే "మీతోనే నేను – మీ వెంటనే నేను" కార్యక్రమం పేరుతో క్షేత్ర స్థాయిలో పర్యటించటంతో పాటు, వారానికి 4 రోజులు పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నాను. గ్రీవెన్స్ డే నిర్వహించిన ప్రతి రోజు కూడా అనేక సమస్యలతో వస్తున్నారు. ప్రధానంగా డివిజన్లలో కనీస మౌలిక సదుపాయాలు అయిన డ్రైన్లు, రోడ్లు మరియు మంచినీటి సమస్యలు తీర్చమని కోరుతున్నారు. గడిచిన 5ఏళ్ల కాలంలో వైసీపీ నేతలు ఎక్కడ కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా, అవినీతిలో మునిగితేలి ప్రజల్ని, ప్రజా సమస్యల్ని గాలికి వదిలి వేశారని, స్థానిక వైసీపీ నేతలు కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లు తిని, బిల్లులు కూడా చెల్లించకుండా వేధించారని, కాంట్రాక్టర్లు పనులు చేయాలంటే వెనకడుగు వేసేలా చేసి, నియోజకవర్గ అభివృద్ధి కుంటు పడేలాగా చేశారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గళ్ళా మాధవి వెల్లడించారు.

# తాగునీటి సరఫరా, చెరువుల లిఫ్ట్‌ల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించను

**●లింగంగుంట్ల తాగునీటి చెరువును, కుప్పగంజివాగు లిఫ్ట్‌ను పరిశీలించిన ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): తాగునీటి చెరువుల నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, చెరువుల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసి, గట్లపై మంచి మొక్కలు పెంచాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలోని మంచినీటిచెరువును, కుప్పగంజి వాగుపై ఉన్న ఎత్తిపోతలపథకాన్ని (లిఫ్ట్) మాజీమంత్రి బుధవారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. మూడు గ్రామాలకు తాగునీరు అందించే చెరువును జాగ్రత్తగా నిర్వహించండి. చెరువులోని పూడిక తొలగించి చుట్టూ మొక్కలు పెంచండి. చెరువులోని పూడికను వేసవిలోనే తొలగించాలని, ఎలాంటి నాచు, తూటికాడసహా, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని, చెరువు గట్టుపై మంచి మొక్కలు పెంచాలని పుల్లారావు ఆర్.డబ్ల్యూఎస్ మరియు పంచాయతీ అధికారుల్ని ఆదేశించారు. గ్రామస్తులు కూడా చెరువును రక్షణలో ప్రభుత్వ సిబ్బందికి సహకరించాలన్నారు. చెరువుకు నీటి సరఫరాకోసం కుప్పగంజి వాగుపై రూ. 25లక్షలతో ఇటీవలే మరమ్మతులు చేసిన లిఫ్ట్ ను పరిశీలించిన మాజీమంత్రి, అధికారులకు పలుసూచనలు చేశారు. లిఫ్ట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని, పైపులైన్ల నుంచి నీరు వృథా అవ్వకుండా చూడాలని, లీకేజ్ లను తక్షణమే సరిచేయాలని చెప్పారు. ఇటీవలే లిఫ్ట్‌కు మరమ్మతుల చేసినందున మోటార్లను జాగ్రత్తగా వినియోగించాలని చెప్పారు. లిఫ్ట్ పాడైతే తాగునీటికి ఇబ్బంది అవుతుందని, ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా పనిచేయాలన్నారు. వేసవిలో ఒక్కరోజు నీటిసరపరా నిలిచిపోయినా అనేక సమస్యలు తలెత్తుతాయనే విషయాన్ని అధికారయంత్రాంగం విస్మరించకూడదన్నారు. లిఫ్ట్ ద్వారా లింగంగుంట్ల, కావూరు, పురుషోత్తమపట్నం గ్రామాలకు తాగునీరు, 2586 ఎకరాలకు సాగునీరు అందుతుందనే నిజాన్ని గుర్తించి పనిచేయాలని మాజీమంత్రి సూచించారు. సొంతనిధులతో లిఫ్ట్ మరమ్మతు పనులు చేయించిన నీటిసంఘం అధ్యక్షులు భైరా సంజీవరావును ఆయనకు సహకరించిన లింగంగుంట్ల గ్రామ టీడీపీ నాయకులు తూబాటి కిశోర్, పెదవలి చంద్రశేఖర్, గ్రామ రైతుల్ని ప్రత్తిపాటి పేరుపేరునా అభినందించారు. సమస్యను గుర్తించి లిఫ్ట్‌ను పునరుద్ధరణలో గ్రామస్తులంతా ఒకే మాటపై ఉండి పనిచేయడం నిజంగా మెచ్చుకోవాల్సిన అంశమన్నారు.

సీసీ రోడ్, డ్రైనేజ్ పనుల నాణ్యతలో తేడాలొస్తే అధికారులే బాధ్యులవుతారు..

నాదెండ్ల మండలంలోని తూబాడు గ్రామంలో రూ. 21లక్షలతో వేస్తున్న సిమెంట్ రోడ్, నిర్మాణంలో ఉన్న డ్రైనేజ్ లను పరిశీలించిన మాజీమంత్రి, నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. మెటీరియల్‌లో తేడా రాకూడదని, రోడ్డు, డ్రైనేజ్‌లు పూర్తయ్యాక నాణ్యతపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వచ్చినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పుల్లారావు అధికారుల్ని హెచ్చరించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల విడుదలలో కూటమిప్రభుత్వంలో ఎలాంటి సమస్యలు రావని, చేసే పనుల్లో లోపాలు లేకుండా చూడాల్సింది కాంట్రాక్టర్లు, అధికారులేనని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు నెల్లూరి సాదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, తుబాటి కిషోర్, అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు : జీవీ

**●వినుకొండలో చీఫ్ విప్ జీవీ ప్రజా దర్బార్‌కి విశేష స్పందన**



వినుకొండ (చైతన్యరథం): ప్రజా సమస్యల పట్ల అధికారులు ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, ప్రతి ఒక్కరు కూడా బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారంలో వినుకొండ నియోజకవర్గాన్ని, పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాల్సిన అవసరం ఉందన్నారు. అదే స్ఫూర్తితో ఇకపై వారం వారం, ప్రతి బుధవారం వినుకొండలోని చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో బుధవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మట్లాడారు చీఫ్ విప్ జీవీ. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజాధనంతో జీతాలు తీసుకునే ప్రతిఒక్కరు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వినతుల్లో వచ్చే ప్రతిసమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజలంతా ఏ నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని భారీ ఆధిక్యంతో అధికారంలోకి తెచ్చారో దానిని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమవద్దకు వచ్చే అర్జీలను స్కాన్ చేసి అధికారికులకు కూడా పంపిస్తున్నామని తద్వారా రికార్డులు పక్కాగా ఉండి యంత్రాంగంలో కూడా జవాబుదారీతనం వస్తుందని ఆశిస్తు న్నామన్నారు. ప్రజాదర్బార్ నిర్వహణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తామందరికీ ఆదర్శంగా పేర్కొన్నారు. పంచాయతీ సర్పంచ్‌లు, వీఆర్వోలు, మండలస్థాయి అధికారులు కూడా ఇకపై ప్రజాసమస్యల పరిష్కారంలో భాగం కావాలని సూచించారు. ఇలా ప్రజల అర్జీల ద్వారా ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున్‌రావు ప్రజలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్డీయే ఎంపీల సమావేశానికి ఎంపి కేశినేని శివనాథ్ హాజరు



ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం కూటమిలోని పార్లమెంట్ సభ్యుల నియోజకవర్గాల సమస్యలు, కేంద్ర పథకాల అమలు, నిధుల అవసరాల గురించి తెలుసుకునేందుకు కేంద్రమంత్రులకు కొంతమంది ఎంపీలను గ్రూపులుగా అప్పగించి ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం కావాలని ఆదేశించింది. కేంద్రమంత్రి హార్టీప్ సింగ్‌కి అధ్యక్షతన ఎన్డీయే ఎంపీల గ్రూపులో ఏపీకి చెందిన కేశినేని శివనాథ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు పంచలింగాల ఉన్నారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అధ్యక్షతన మంగళవారం రాత్రి ఢిల్లీలోని ఆయన నివాసంలో పలువురు ఎన్డీయే ఎంపీలతో డిన్నర్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కి ఏరోస్పేస్, డిఫెన్స్ పారిశ్రామిక రంగాలు వచ్చే విధంగా సహకరించాలని రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ కోరగా... ఆయన సానుకూలంగా స్పందించారని కేశినేని తెలిపారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి గురించి కేంద్రమంత్రులతో చర్చించడం జరిగిందని కేశినేని శివనాథ్ తెలిపారు.

అనంతరం బుధవారం డీఆర్‌డీవో ఛైర్మన్ సమీర్ విక్రాంత్‌తో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రక్షణరంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించిన కేశినేని చిన్ని... విజయవాడ పరిసరాల్లో పారిశ్రామిక అభివృద్ధిపై చర్చించ్చారు. విజయవాడలో రక్షణ పరికరాల పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న కేశినేని శివనాథ్ ప్రతిపాదనలను ఛైర్మన్ సమీర్ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

## ఎమ్మెల్యే ముత్తుముల, అడిగిన వెంటనే తాగునీటి బోరు మంజూరు

ఉదయగిరి, (చైతన్యరథం): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం కొమరోలు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చినపుడు అధికారులు వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కారం చేయాలని, ఒకే పని మీద పదే పదే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతీ అధికారి జవాబుదారీ



తనంతో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కారం చేయాలన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలకు మంచి చేసినపుడే ప్రభుత్వం పట్ల విశ్వాసం ఏర్పడుతుందని అందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ప్రజా దర్బార్‌లో ప్రజలు ఎమ్మెల్యేకు భూ సమస్యలు, విద్యుత్, రహదారులు, త్రాగునీటి సమస్యల పై అర్జీలను ఇవ్వగా వాటిని పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూరవారిపల్లె పంచాయతీ, బొడ్డువానిపల్లె గ్రామంలో నీటి ఎద్దడి, ఉందని ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు తెలియచేయగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గారు గ్రామంలో మంచినీటి బోరును వేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అదే విధంగా హనుమంతురాయుని పల్లె గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామ ప్రజలు తెలుపగా, వెంటనే ఆ సమస్యను పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు.. ప్రజా దర్బార్ లో మొత్తం 102 అర్జీలు రాగా వాటిని వెంటనే పరిష్కారం చేసి అర్జీదారులకు తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, ఎంపీపీ అమూల్య, ఎమ్మార్వో భాగ్యలక్ష్మి, మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, అన్ని విభాగాల అధికారులు తెలుగుదేశం నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# సమష్టి కృషి తోనే సమస్యల పరిష్కారం

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): మండల సమస్యలపైబుధవారం ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో ప్రజా దర్బార్ నిర్వహించారు. దర్బార్‌లో దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ముఖ్యఅతిథిగా పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు గారు, డిఎస్పి లక్ష్మీనారాయణ, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ , కృష్ణమూర్తి, ఆవుల సుధాకర్, దర్శి మున్సిపల్ కమిషనర్ మహేష్, విద్యుత్ శాఖా అధికారులు ఎడీ క్రిష్ణా రెడ్డి , పట్టణ, రూరల్ ఎఈ చిన్న అంకబాబు, వెనుబాబు, రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్ పంచాయతీ రాజ్ మున్సిపల్ ఆర్ అండ్ బి, ఆరోగ్య సిబ్బందితో పాటు మండలంలోని అన్నీ శాఖల




అధికారులు పాల్గొని, దర్శి మండల ప్రజానీకం నుండి అర్జీలు సేకరించారు. డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రజలను ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పుకోకుండా తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించి, మన ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు సేవకులుగా జవాబుదారీతనంతో అధికార యంత్రాంగం పనిచేయాలని ఆమె కోరారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజలు సమిష్టిగా పని చేస్తేనే సాధ్యమన్నారు. తొమ్మిది నెలల పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మాత్యులులోకేష్ ప్రజల సుఖ సంతోషాల కోసం ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఎంత కష్టపడుతున్నారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు 15 కోట్లతో గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రధాన రహదారులు ఐదుకోట్లతో జరుగుతున్నాయని, ఐదేళ్లలో వైసీపీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉండి సంపూర్తిగా వదిలేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతున్నామని డాక్టర్ లక్ష్మీ వివరించారు. టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, డిగ్రీ కాలేజీ నిర్మాణం, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు అన్నా క్యాంటీన్ దొనకొండలో సోలార్ పార్క్ ఏర్పాటు, వెనుకబడిన దర్శి ప్రాంతంలో వలసలు నివారించి ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు.

# ఘనంగా సోమిరెడ్డి పుట్టిన రోజు వేడుకలు

## వేదాయపాళెంలో రక్తదాన శిబిరం




నెల్లూరు, (చైతన్యరథం): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నెల్లూరు వేదాయపాళెంలోని కార్యాలయం వద్ద బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ అభిమాన నాయకుడికి మద్దతుగా దాదాపు 153 మంది యువకులు రక్తదానం చేశారు. తనయుడు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు రక్తదానం చేసిన వారిలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. ప్రాణంతో సమానమైన రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అభినందించారు.



### వెబ్ సైట్ ఆవిష్కరణ

సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన బాల్యం నుంచి రాజకీయ జీవితానికి సంబంధించిన అన్ని అంశాలతో వెబ్ సైట్ రూపకల్పన చేసి విద్యార్థి రాజకీయాల నుంచి నేటి వరకు 40 ఏళ్ల ప్రజాజీవితానికి సంబంధించిన కీలక ఘట్టాలతో వెబ్ సైట్‌ను ఆవిష్కరించారు. సారా వ్యతిరేక ఉద్యమం, థర్మల్ పవర్ ప్రాజెక్టుల కాలుష్య వ్యతిరేక పోరాటం, రైతుల కోసం చేసిన అన్ని ఉద్యమాలు, కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణతో పాటు ఏపీ జెన్‌కో థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, రాజకీయ జీవితంలో చేసిన అన్ని ప్రజా ఉద్యమాలకు వెబ్ సైట్ లో చోటు కల్పించారు.

# టీడీపీ నేత ఆయిల్‌మిల్‌కు ఎమ్మెల్యే పరామర్శ

## ఏ కష్టమొచ్చినా తానున్నానని కాకర్ల భరోసా

ఉదయగిరి, (చైతన్యరథం): ఉదయగిరి మండలం సీనియర్ నాయకులు గానుగపెంట ఓబుల్ రెడ్డి (ఆయిల్ మిల్) ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆయన నివాసంలో ఆదివారం పరామర్శించారు. శివరాత్రి పర్వదినం రోజున రోడ్డు ప్రమాదంలో పాదము వద్ద బలమైన గాయమై వైద్యం చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా ఫోన్ ద్వారా తెలియపరిచి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ మండల కన్వీనర్ సిహెచ్ బయన్న పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య నల్లిపోగు నరసింహులు ఎల్‌సి రమణారెడ్డి షేక్ రియాజ్ ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.



# వంద రోజుల విశ్వసనీయ పాలన

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

### కూటమి సహకారంతో కొత్త అధ్యాయానికి శ్రీకారం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక లీగల్ టీం 162 పెండింగ్ కేసులను పరిష్కారం 386 మందికి సకాలంలో నోటీసులు కర్నూల్ లోని 38.70 ఎకరాల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు



నెల్లూరు, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్ బాధ్యతలు స్వీకరించి వంద రోజులు పూర్తయింది. వంద రోజుల పాలనపై ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ బుక్లెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక లీగల్ టీం ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 162 పెండింగ్ కేసులను పరిష్కరించామని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కేసుల్లో జాప్యం జరగటంతో సీనియర్ న్యాయవాదులను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. కర్నూల్ లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన 224.15 ఎకరాల రోజా దర్గాకు సంబంధించిన భూమి అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేసేందుకు చర్యలు తీసుకున్నామని, అందులో ఇప్పటికే 38.70 ఎకరాల భూమి యొక్క అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేశామని తెలిపారు. ఎలాంటి రాజీ లేకుండా పారదర్శకమైన నోటీసులు జారీ వ్యవస్థ అమలు చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమణదారులు అద్దెదారులు బాకీదారులకు 266. 22 ఎకరాలకు గాను 386 మందికి సకాలంలో నోటీసులు అందజేశామని తెలిపారు. వీలైనంత త్వరగా వాటిని స్వాధీనం చేసుకునే దిశగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణ కోసం క్లస్టర్ల వారీగా ప్రత్యేక నిఘా బృందం ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో లేనివిధంగా వక్ఫ్ బోర్డ్ ఉద్యోగుల సహాయనిది ఏర్పాటు చేశామని, ఆర్థిక లావాదేవీల పారదర్శకతను పెంచామని, గతంలో లేని విధంగా క్లౌడ్ బేస్ ర్యాలీ అకౌంటింగ్ సాఫ్ట్ వేర్ ను అమలుపరిచామని, సిబ్బందికి ఫైనాన్స్ మరియు అకౌంటింగ్ పై ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. గతంలో లేని విధంగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ప్రారంభించామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చెల్లింపుల కోసం పిఓఎస్ యంత్రాలు ఏర్పాటు చేశామని వబ్బుడాదాయం పెంచే మార్గంలో ఒక ఆస్తుల లీజు మొత్తాలను శాస్త్రీయంగా నిర్ణయించి వసూళ్లకు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ తో భేటీ అయి ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం తీసుకొచ్చామని, ఏపీ వక్ఫ్ బోర్డ్ కు రావాల్సిన పెండింగ్ నగదు చెల్లింపులపై పరస్పర అంగీకారానికి వచ్చామని తెలంగాణ వక్ఫ్ బోర్డ్ ఆఫీసులోని ఏపీ వక్ఫ్ బోర్డ్ రికార్డుల తరలింపు కోసం సంయుక్త కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కర్నూల్ లోని దర్గా హజరత్ షేక్షావలి షా వలి దర్గా వివాదాలను పరిష్కరించామని, సీనియర్ న్యాయవాదుల సహాయంతో అనేక చట్టపరమైన, జటిలమైన సమస్యలను పరిష్కరించామని బహిరంగ వేలం ద్వారా రికార్డు స్థాయిలో కోటి రూపాయల దర్గా అదాయాన్ని పెంచామని తెలిపారు. గత త్రైమాసికంతో పోలిస్తే వక్ఫ్ బోర్డుకు 32% ఆదాయాన్ని పెంచామని తెలిపారు. కేవలం ఈ వంద రోజుల్లోనే విశేషమైన మార్పులు తెచ్చామని తెలిపారు.

# ఎక్కడ చూసినా భూ తగాదాలే

**అసైన్మెంట్ కమిటీలతో భూ సమస్యల పరిష్కారం ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే పరిటాల సునీత**

**పార్టీ కార్యకర్తలు, ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, పింఛన్లు**

వెంకటాపురం, (చైతన్యరథం): ఏ గ్రామంలో చూసినా భూ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేస్తే కాస్తైనా వీటికి పరిష్కారం లభిస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభిప్రాయపడ్డారు. శ్రీ సత్య సాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆమె పాల్గొన్నారు. ఉదయం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యకర్తలు తీసుకొచ్చిన సమస్యలు కూడా విన్నారు. ఆ తర్వాత టీడీపీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో ప్రతి శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించే వారమని.. దానిని బుధవారానికి మార్చినట్లు తెలిపారు. ఎక్కడ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించినా.. భూ సమస్యలే ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇప్పటికే వీటిని మంత్రి సత్య ప్రసాద్ దృష్టికి




తీసుకెళ్లినట్లు తెలిపారు. అన్నదమ్ములు, పాస్ బుక్కులు, సరిహద్దు వివాదాలు వంటివి ఎక్కువగా ఉన్నాయని వీటిని గ్రామాల్లో పెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటే మంచిదని సూచించారు. అసైన్మెంట్ కమిటీల ద్వారా దీనికి కొంత పరిష్కారం లభిస్తుందని... మంత్రి కూడా వెంటనే కమిటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. భూమి తక్కువగా ఉండి.. పాస్ బుక్కులు ఎక్కువగా ఉన్న సమస్యలు కూడా ఉన్నాయని, ఇలాంటి చోట రెవెన్యూ అధికారులు రీసర్వేలు చేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. గత ప్రభుత్వంలో కక్ష కట్టి రేషన్ కార్డులు తొలగించిందన్నారు. వీటిని త్వరలోనే మంజూరు చేస్తామని చెప్పారు. పింఛన్ల విషయంలో కూడా గత ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందన్నారు. ఇక ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కుటుంబ సాధికార సారధి కార్యక్రమాన్ని ఈనెల ఆఖరు లోగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైందన్నారు. జాతీయ అధ్యక్షుడు నుంచి బూత్ ఇన్ ఛార్జ్, బూత్ కమిటీ సభ్యుల వరకు అందరూ ఇందులో నమోదు కావాల్సి ఉందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న తర్వాత ఏ పదవి కావాలన్నా, నామినేటెడ్ పోస్ట్ కావాలన్నా.. కెఎస్ఎస్ లో ఉండాల్సిందేనన్నారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా 120 మంది ఓటర్లతో కూడిన కేఎస్ఎస్ ని కలవాలని అన్నారు.

# మౌలిక వసతుల కల్పనలో రాజీపడొద్దు

**అధికారులకు ఎమ్మెల్యే కేఈ ఆదేశం**

పత్తికొండ, (చైతన్యరథం): నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని తుగ్గలి, మద్దికేర, పత్తికొండ మండలాల నుండి వివిధ



సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు సమర్పించారు. గ్రామాలలోని వివిధ సమస్యలపై అర్జీలు రాసుకున్న ప్రజలు ఎమ్మెల్యేకు తెలియజేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను సకాలంలోనే పరిష్కరిస్తామని అన్నారు. ఈ వేసవి కాలంలో పత్తికొండ నియోజకవర్గం లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. తాగునీటి పైప్‌లైన్ సరిగా లేక తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులు రానున్న పండుగను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

**ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**

చిత్తూరు, (చైతన్యరథం):ప్రజా సమస్యలను సంబంధిత అధికారులు వేగంగా పరిష్కరించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదేశించారు. బుధవారం చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీలోని శాసనసభ్యుల వారి కార్యాలయం "ప్రజా దర్బార్లో" ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. పలు సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి ఆదేశాలతో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందని.. సమస్య తీవ్రతను బట్టి అధికారులు వేగంగా స్పందించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, భూ సమస్యలు, పింఛన్లు వంటి సమస్యలను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఆర్థికపరమైన రోడ్లు, కాలువల నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక సమర్పించాలన్నారు. బుధవారం నాటి కార్యక్రమంలో 164 వినతులు అందాయి. వీటిని ఆన్ లైన్ ద్వారా సంబంధిత శాఖలకు పంపుతామన్నారు.ో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, తహశీల్దార్లు జయంతి, లోకేశ్వరీ, ఎంహెచ్వో డా. లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో ఘనంగా ఇఫ్తార్ వేడుకలు

పుట్టపర్తి, (చైతన్యరథం): ముస్లింల పవిత్ర పండగైన రంజాన్ వేడుకల సందర్భంగా ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనులపల్లి గణేష్ సర్కిల్లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదీ మహల్ లో ప్రభుత్వం తరఫున ఇచ్చారు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ముస్లిం సోదరులు ఉపాస దీక్షను అక్కడే వినిపింపజేసి ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా పుట్టపర్తి శాసనసభ్యుల పల్లె సింధూర రెడ్డి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు మాట్లాడుతూ... ముస్లింలకు అత్యంత




పవిత్రమైన రంజాన్ పర్వదినాన ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొనడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ విజయసారథి, ఆర్ డి ఓ సువర్ణ, మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, సయ్యద్, అబ్దుల్, రఫీ, అల్లా ప్రకాష్ పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# సామాన్య కార్యకర్తకూ న్యాయం జరగాలి

**టీడీపీ నేతలకు ఎమ్మెల్యే కోట్ల పిలుపు**

డోన్, చైతన్యరథ)ం): డోన్ నియోజక వర్గం బేతంచర్ల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అంశాలపై చర్చ జరిగింది. ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందరూ గ్రూప్ ఇజం లేకుండా పనిచేయాలన్నారు. సామాన్య కార్యకర్తకు న్యాయం జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. ఎలక్షన్లలో తెలుగుదేశం పార్టీకి పనిచేసిన కార్యకర్తలకు నాయకులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే ఏవైనా పనులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలంలో జరిగే అభివృద్ధి పనుల గురించి మాట్లాడుతూ త్రాగునీటి కోసం గ్రిడ్డు వారితో మాట్లాడి పనులను వేగవంతం చేస్తామన్నారు. మొదటగా బేతంచెర్ల మండలం ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడుతూ అందరూ కార్యకర్తలు త్వరగా కుటుంబ సాధికార



సారధుల నియామకానికి పేర్లను అందజేయాలని కోరారు. బేతంచర్ల మండల కన్వీనర్ నాగయ్య మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి త్వరలో వచ్చే లోకల్ బాడీ ఎలక్షన్లలో అన్ని స్థానాలు టీడీపీ గెలుచుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. బేతంచర్ల టౌన్ కన్వీనర్ బుగ్గన ప్రసన్నమ్మ మాట్లాడుతూ పార్టీకి కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరగాలని కోరారు. బేతంచెర్ల మండలం నాయకులు రాఘవ రెడ్డి మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు, టిడిపిలో మెంబర్షిప్ ఉన్న కార్యకర్తలకు మాత్రమే పనులు చేయాలని సూచించారు. బేతంచెర్ల మండల ఇంచార్జ్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నాయకులు పనుల కోసం వచ్చేవారు టీడీపీ కార్యకర్తలు మాత్రమే పిలుచుకొని రావాలని వైసీపీకి సంబంధించిన కార్యకర్తలకు పనుల కోసం రికమెండ్ చేయవద్దని తెలియజేశారు. సిమెంట్ నగర్‌కు చెందిన రాముడు మాట్లాడుతూ వైసీపీ నుంచి పార్టీలోకి వచ్చిన కార్యకర్తలకు పనులు చేస్తున్నారని తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు పెట్టి వేధించారని, ఇప్పుడు కూడా కేసులు పెడుతున్నారని ఆవేదన చెందారు.

# కాశీనాయన సన్నిధిలో ఎమ్మెల్యే ఆది

**సమస్యల పరిష్కారానికి హామీ**

కాశీనాయన, (చైతన్యరథం): ప్రముఖ పుణ్యక్షేత్రం కాశిరెడ్డి నాయన జ్యోతి క్షేత్రాన్ని జమ్మలమడుగు నియోజవర్గం శాసనసభ్యులు చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామి రెడ్డి సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ వారితో స్థానిక అవసరాలను సమస్యలను పరిష్కరించడం కోసం సమావేశం నిర్వహించి




సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకొని తొందరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ విజయమ్మ ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

# ఇ-పాలన మీకోసం

**మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి వినూత్న ప్రయత్నం**

మంత్రాలయం, (చైతన్యరథం): సీఎం నారా చంద్రబాబు నాయుడు అదేశాల మేరకు ప్రజా సమస్యలపై ప్రభుత్వ అధికారులకు జవాబుదారీతనం పెరగాలని మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు, ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో మొదటి సారిగా రాష్ట్ర స్థాయి నుండి మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారుల వరకు అనుసంధానం చేస్తూ ప్రజల నుండి స్వీకరించే అర్జీలను ఆన్ లైనులో కంప్యూటరీకరించే కార్యక్రమమైన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ' మీకోసం ' ఏర్పాటుచేశారు. ప్రజల నుండి వచ్చే అర్జీలు వాటి స్థితి పరిష్కార వివరాలు, సంక్షిప్త సందేశాలు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకొని సత్వర పరిష్కారం నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. సమస్యలు తెల్సుకొని వాటిని పరిష్కరించే విధంగా ప్రజా వేదికగా ముందుకుపోతున్నారు.



## ముస్లీంలను ఓటు బ్యాంకుగా వాడుకున్న వైసీపీ

**టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్ మొహిద్దీన్**

అనంతపురం, (చైతన్యరథం): సమాజంలో ముస్లింలు అన్ని వర్గాల కంటే పేదరికంలో మగ్గుతున్నారని.. వారికి ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ఇంకా ఎక్కువ సాయం అందించాల్సిన అవసరం ఉందని గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బాలక్రిష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మోద్దీన్ అన్నారు. రంజాన్ పండుగ నేపథ్యంలో ఆయన ఈ ఏడాది కూడా పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. బుధవారం సాయినగర్ 3వ క్రాస్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



# ఆగని కునాల్ పేరడీ ప్రహసనం

## నిన్న మహా డిప్యూటీ నేడు కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ - సమన్లతో వెంటాడుతున్న పోలీసులు



స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిండే మరోసారి స్పందించారు. ఎవరిదగ్గరో తీసుకున్న సుపారీ కారణంగానే తనపై వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. "మీరు నన్ను పదేపదే గద్దార్, గద్దార్ అని పిలుస్తున్నారు. త్వరలో మీరు మీ పార్టీ తలుపులు మూసివేయాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు, స్పీకర్‌తో పాటు ఎన్నికల్లో ప్రజలు తీర్పు చెప్పారు. మీరు ఎంత సుపారీ ఇచ్చినా.. అది పనిచేయదు" అని శివ సేన(యూబీటీ)ని ఉద్దేశించి ఘాటుగా విమర్శలు చేశారు. ఇటీవల ముంబయిలోని యూనికాంటినెంటల్ హోటల్‌లోని హాబిటాట్ కామెడీ స్టూడియోలో కునాల్ కామ్రా హాస్య వినోద కార్యక్రమం నిర్వహించి దానిని రికార్డు చేశారు. ఇందులో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందేను "గద్దార్" (ద్రోహి) గా అభివర్ణిస్తూ 'దిల్తో పాగల్ హై' హిందీ చిత్రంలోని ఒక సినీ గీతానికి పేరడీని కామ్రా ఆలపించడం ఈ వివాదానికి కారణమైంది. ఉప ముఖ్యమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు చేశారన్న కారణం చూపుతూ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా హాబిటాట్ స్టూడియోపై శివసేన కార్యకర్తలు దాడి చేశారు. ఈ పరిణామాలపై మంగళవారం మీడియాతో మాట్లాడుతూ శిందే స్పందించారు. "ఇలాంటి పనులు చేయడానికి ఆయన (కునాల్) ఎవరి నుంచి సుపారీ తీసుకున్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ముఖ్యం. కానీ వేరే వారి తరపున ఇతరుల గురించి తప్పుగా మాట్లాడటం సరికాదు. నా గురించి మర్చిపోండి.. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి, హోం మంత్రి గురించి ఏం మాట్లాడారో చూడండి. అలాగే నేను విధ్వంసాన్ని సమర్థించను" అని శిందే అన్నారు. శిందేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కామా చేసిన పేరడీపై వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీనిపై విచారణలో భాగంగా పోలీసులు సమన్లు జారీ చేస్తున్న సమయంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ని ఉద్దేశిస్తూ కునాల్ మరో పాట పాడారు. 'మిస్టర్ ఇండియా' సినిమాలోని హవా హవాయి పాటను పేరడీ చేసిన ఆయన.. పన్ను చెల్లింపుదారుల సొమ్ము వృథా అవుతోందంటూ అందులో ఆరోపించారు.

# కన్నడ బీజేపీ ఎమ్మెల్యేపై సస్పెన్షన్ వేటు

## ముక్కుసూటిగా మాట్లాడినందుకే ఈ రివార్డు - బాధితుడు బసనగౌడ రియాక్షన్



కర్ణాటక భాజపా బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై ఆ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. ఆరేళ్ల పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ భాజపా కేంద్ర క్రమశిక్షణ కమిటీ ఆయనకు లేఖ రాసింది. పార్టీతో పాటు మాజీ సీఎం బీఎస్ యడియూరప్పకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో గత నెల 10న షోకాజ్ నోటీసులు జారీ చేసిన భాజపా.. తాజాగా ఆయనపై కఠిన చర్యలు తీసుకుంది.

***ప్రశ్నించినందుకు రివార్డ్: బసనగౌడ***

పార్టీ నుంచి తనను బహిష్కరించడంపై ఎమ్మెల్యే బసనగౌడ స్పందించారు. వారసత్వ రాజకీయాలు, అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు, పార్టీలో సంస్కరణలు, వ్యక్తుల ఆధిపత్యాన్ని తొలగించాలని, ఉత్తర కర్ణాటకను అభివృద్ధి చేయాలని అడిగినందుకు తనను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించారని ఆరోపించారు. ముక్కుసూటిగా మాట్లాడినందుకు ఇది పార్టీ తనకు ఇచ్చిన రివార్డుగా పేర్కొన్నారు. అవినీతి, కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా, ఉత్తర కర్ణాటక అభివృద్ధి, హిందుత్వ కోసం తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఇదే ఉత్సాహం, దృఢ సంకల్పంతో ప్రజాసేవ చేస్తానని, తనకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

# అసత్య ప్రకటనలకు అడ్డుకట్ట

## ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం - వెంటనే ఏర్పాటు చేయాలని సుప్రీం ఆదేశం



తప్పుదారి పట్టించే ప్రకటనలు సమాజానికి తీవ్ర హాని చేస్తాయని భారత సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయానికి సంబంధించి 'ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని' ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. రెండు నెలల్లోగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్టు–1954 కింద నిషేధించిన ప్రకటనలకు సంబంధించి అభ్యంతరాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్రాలు రూపొందించాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. వీటిని రెండు నెలల్లో ఏర్పాటు చేయాలని, దీని గురించి ప్రచారం కూడా కల్పించాలని స్పష్టం చేసింది.


1954 చట్టంలోని నిబంధనల అమలుపై పోలీసులకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కట్టడికి సంబంధించి గతంలో పలు సూచనలు చేసిన న్యాయస్థానం.. ప్రకటనలు జారీ చేసే ముందు కేబుల్ టెలివిజన్ నెట్వర్క్ రూల్ 1994 ప్రకారం స్వీయ ధ్రువీకరణ తీసుకోవాలని ఆదేశించింది. ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని పేర్కొంటూ ఆ సంస్థను మందలించింది. అనంతరం పతంజలి ఆయుర్వేద సంస్థ కూడా సుప్రీం కోర్టుకు క్షమాపణలు తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఇటువంటి ప్రకటనల కట్టడి చర్యల్లో భాగంగా సుప్రీం తాజా ఆదేశాలు జారీ చేసింది.

# క్షిపణి పరీక్ష.. 32వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ఒడిశాలోని చాందీపుర్ ప్రాంతంలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి క్షిపణి పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమీపంలోని గ్రామాలలో నివసిస్తున్న సుమారు 32,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు.

ఐటీఆర్ లాంచ్ ప్యాడ్ –3 నుంచి దగ్గరగా ఉన్న ఆరు గ్రామాల ప్రజలను బుధవారం తెల్లవారుజామున సమీపంలోని మూడు ప్రభుత్వ కేంద్రాలకు తరలించినట్లు పేర్కొన్నారు. క్షిపణి పరీక్షలు ముగిసే వరకు ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఉండాలని సూచించింది. వారి వసతి, ఇతర అవసరాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. ప్రజల అవసరాలు, బాగోగులు చూడడానికి వంద మందికి పైగా మంది ప్రభుత్వ సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది.

# యోగి ఆదిత్యనాథ్ విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రయాణిస్తున్న చార్టర్డ్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆగ్రాలోని ఖేడియా విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ అయ్యింది. ఆగ్రా పర్యటనలో ఉన్న సీఎం యోగి ఆదిత్యనాథ్, మధ్యాహ్నం 3.40కు పర్యటన ముగించుకొని బయలుదేరారు. విమానం టేకాఫ్ అయిన 20 నిమిషాలకు సాంకేతిక సమస్య తలెత్తిందని గుర్తించిన పైలట్లు వెంటనే వెనక్కి మళ్లించారు. ముందు జాగ్రత్త చర్యగా ఖేడియా ఎయిర్‌పోర్ట్‌లో దించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోఢిల్లీ నుంచి మరో విమానాన్ని పిలిపించారు. అది వచ్చేవరకు దాదాపు గంటన్నరకు పైగా సీఎం యోగి ఆగ్రా ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లోనే వేచి ఉన్నట్లు తెలిసింది. చివరకు మరో విమానం రావడంతో లఖ్‌నవూ బయలుదేరి వెళ్లినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# నా నలుపు సత్యం.. కురిసే వర్షానికి వాగ్దానం

*- కేరళ సీఎస్ శారదా మురళీధరన్*



రంగులో ఏముంది.. గుణం ముఖ్యమంటారు పెద్దలు. ఆ మాట మనసులో పెట్టుకొని ఉన్నత స్థానాన్ని అధిరోహించారామె. చీఫ్ సెక్రటరీ అయినా ఆమె శరీర వర్ణం గురించి అన్న మాటలు మాత్రం వెంటాడాయి. చివరకు తన భర్త రంగుతోనూ పోలిక తెస్తూ చేసిన పోస్టులు కంటపడ్డాయి. వీటికి ఆమె బదులు ఇవ్వాలనుకున్నారు. ఈ క్రమంలో ఉద్వేగపూరితంగా ఫేస్‌బుక్‌లో ఓ పోస్టు పెట్టారు. ఆమే కేరళ చీఫ్ సెక్రటరీ శారదా మురళీధరన్.

శారదా మురళీధరన్.. 1990 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. కొద్దినెలల క్రితమే కేరళ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. తన భర్త తర్వాత ఆ స్థానంలో శారద నియమితులవడం విశేషం. వారిద్దరినీ గమనించిన పలువురు రంగు గురించి చేసిన కామెంట్లు ఆమె దృష్టికి వచ్చాయి. "నా రంగును నేను అంగీకరించాల్సి ఉంది. ఈ క్రమంలోనే నేను ఒక పోస్టు చేశాను. ఆ తర్వాత వచ్చిన కామెంట్లతో కాస్త కంగారుకు గురై.. దానిని తొలగించాను. అయితే నేను పేర్కొన్న అంశాలు చర్చించాల్సినవేనని నా శ్రేయాభిలాషులు చెప్పడంతో మళ్లీ తిరిగి షేర్ చేశాను" అని తాను డిలీట్ చేసిన మాటలను తిరిగి పంచుకున్నారు.

"ఒక సీనియర్ అధికారిణిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అంతకుముందు ఆ స్థానంలో ఉన్న భర్తతో పోలికలు తీసుకొచ్చారు. అదేదో సిగ్గుపడాల్సిన విషయం అన్నట్టు.. అది అసలు మంచి కాదన్నట్టు.. నా రంగు గురించి మాట్లాడారు. కానీ నలుపును ఎందుకు అవమానించాలి. అది విశ్వమంతా వ్యాపించి ఉన్న సత్యం. వర్షానికి ముందు కనిపించే వాగ్దానం. సాయంత్రానికి సూచిక.. అసలు అది లేనిదెక్కడ" అంటూ రాసుకొచ్చారు. అలాగే చిన్నతనంలో తాను ఎదుర్కొన్న అనుభవాన్ని వివరించారు. "ఈ రంగు చిన్నప్పుడే నేను పెద్ద మాటలు పలికేలా చేసింది. మళ్లీ నన్ను తన గర్భంలోకి తీసుకెళ్లి తెల్లగా, అందంగా తీసుకురాగలవా అని నాలుగు సంవత్సరాల వయసులో నేను నా తల్లిని అడిగేంతలా. ఆ రంగు ప్రభావం నాపై 50 ఏళ్లపాటు కొనసాగింది. నలుపునకు విలువ లేదనే భావనలో తెలుపు పట్ల ఆకర్షితురాలినయ్యా. దానివల్ల నేను తక్కువ వ్యక్తిగా భావించా. కానీ నా పిల్లలు ఆ వర్ణం అద్భుతమని, అందమైనదని నేను గుర్తించేలా చేశారు" అంటూ వివరించారు.

వ్యక్తిగతంగా తనకు ఎదురైన అనుభవాలను ఇలా బహిరంగంగా పంచుకోవడం పట్ల శారదను అంతా అభినందిస్తున్నారు. కేరళలో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ స్పందిస్తూ.. ఆమె వెలిబుచ్చిన ప్రతిమాట హృదయాన్ని తాకింది. నా తల్లి కూడా నల్లటి ఛాయను కలిగి ఉండేది. ఇది చర్చించాల్సిన అంశం" అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక శారద విషయానికొస్తే.. ఆమె గతంలో పలు కీలక హోదాల్లో విధులు నిర్వర్తించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ డైరెక్టర్ జనరల్‌గా నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్లో సీఓఓగా, కుదుంబశ్రీ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. కేరళ చరిత్రలో తొలిసారి భర్త నుంచి ఆమె చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో ఆ నియామకం అందరి దృష్టినీ ఆకర్షించింది.

# సీఐఆర్ఎఫ్‌పైనే ఆంక్షలు పెట్టాలి

- పక్షపాత సిఫార్సులతో భారత ప్రతిష్ఠను దెబ్బతీయలేరు
- యూఎస్ కమిషన్‌కు స్ట్రాంగ్ కౌంటరిచ్చిన భారత్
- 'రా'పై ఆంక్షలు విధించాలన్న యూఎస్ సీఐఆర్ఎఫ్




భారత నిఘా సంస్థ 'రా'పై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన 'ది యూఎస్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్' పేర్కొనడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. అరుదైన సంఘటనలను తప్పుగా చూపించేందుకు ఆ సంస్థ నిరంతర ప్రయత్నాలు చేస్తోందని మండిపడింది. అసహనాన్ని వెల్లగక్కుతూ భారత ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలు ఫలించవంటూ దీటుగా బదులిచ్చింది. "యూఎస్ సీఐఆర్ఎఫ్ ఇటీవల విడుదల చేసిన వార్షిక నివేదిక-2025ను చూశాం. రాజకీయ ప్రేరేపిత, పక్షపాత ధోరణిలో మరోసారి తన విశ్లేషణలు చేసింది. అరుదైన సంఘటనలను తప్పుగా చూపుతూ, భారత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు నిరంతర ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. వీటిని చూస్తుంటే మతస్వేచ్ఛపై ఆ సంస్థకున్న ఆందోళనకంటే ఉద్దేశపూర్వక అజెండానే ఎక్కువగా కనిపిస్తోంది. నిజానికి యూఎస్ సీఐఆర్ఎఫ్‌పైనే ఆంక్షలు విధించాలి" అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూఎస్సీఐఆర్ఎఫ్ ఇటీవల విడుదల చేసిన నివేదికలో భారత్‌పై మరోసారి ఆరోపణలు చేసింది. భారత్‌లో మైనార్టీలపై మతపరమైన వేధింపులు పెరిగాయని, దాడులు కూడా ఎక్కువయ్యాయని పేర్కొంది. ఇలా అల్పసంఖ్యాకులు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, మత స్వేచ్ఛ విషయంలో ఆందోళనకర దేశంగా భారత్‌ను ప్రకటించాలని సూచించింది. సిక్కు వేర్పాటువాదుల హత్యకు కుట్ర పన్నినట్టు ఆరోపణల నేపథ్యంలో భారత నిఘా సంస్థ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్‌పైనా ఆంక్షలు విధించాలని అక్కడి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

అయితే.. ఈ సంస్థ ఇచ్చిన నివేదికను, సూచనలను ట్రంప్ కార్యవర్గం తప్పనిసరిగా పాటించాలన్న నిబంధన లేదు. వియత్నాంలోని కమ్యూనిస్ట్ పాలకులను కూడా ఈ కమిషన్ నివేదిక లక్ష్యంగా చేసుకొంది. మత వ్యవహారాలను ఆ దేశం నియంత్రిస్తోందని పేర్కొంది. ఆ దేశాన్ని ఆందోళనకర జాబితాలో చేర్చాలని పేర్కొంది. చైనాను కట్టడి చేసే క్రమంలో అమెరికా పాలకులు భారత్, వియత్నాంతో కలిసి పనిచేస్తున్న సంగతి తెలిసిందే. బీజింగును కట్టడి చేయడానికి న్యూఢిల్లీ బలమైన శక్తి అని అమెరికా కొన్నేళ్లుగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ కార్యవర్గం భారత నిఘా సంస్థ 'రా'పై ఎటువంటి చర్యలు చేపట్టకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

2023లో అమెరికా, కెనడాలో సిక్కు వేర్పాటువాదులను భారత్ లక్ష్యంగా చేసుకొంటోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్‌పై అమెరికా ఆరోపణలు మోపింది. ఖలిస్థానీ నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నినట్టు దానిలో పేర్కొంది. మరోవైపు అమెరికాలో ఉంటూనే పన్నూ భారత ప్రభుత్వానికి బెదిరింపు సందేశాలను విడుదల చేస్తుండటం విశేషం. సీఆర్పీఎఫ్ స్కూళ్లను, ఎయిర్ ఇండియా విమానాలను, కుంభమేళాను లక్ష్యంగా చేసుకోవాలని ఖలిస్థానీలకు అతడు పలుమార్లు పిలుపునిచ్చాడు.

# గ్రీన్‌లాండ్ భద్రత కోసమేనట..!

**ఉషాకు తోడుగా వాన్స్ గ్రీన్‌లాండ్ పర్యటన**




అమెరికా అధ్యక్ష కార్యవర్గంలోని కీలక అధికారులు, సెకండ్ లేడీ ఉషా వాన్స్ తమ దేశంలో అనధికారిక పర్యటనకు రానుండటాన్ని గ్రీన్‌లాండ్ ఇటీవల తప్పుపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక ప్రకటన చేశారు. శుక్రవారం తన సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి గ్రీన్‌లాండ్ పర్యటనకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేస్తూ.. ప్రపంచ భద్రత ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్ ప్రజల భద్రతను పునరుజ్జీవింపజేయాలని అనుకుంటున్నారని, అందులోభాగంగానే అక్కడి పరిస్థితులను సమీక్షించడానికి వెళ్తున్నట్టు తెలిపారు. గ్రీన్‌లాండ్ వాయువ్య తీరంలో ఉన్న స్పేస్ ఫోర్స్ అవుట్‌పోస్ట్ సైనిక స్థావరాలను సందర్శిస్తామన్నారు. ప్రపంచదేశాల భద్రతను కాపాడటం ముఖ్యమని తాము భావిస్తున్నందున ఈ పర్యటనకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కాగా డెన్మార్క్ ఆధీనంలోని గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేస్తానని అమెరికా అధ్యక్షుడు పదేపదే పేర్కొంటున్న సమయంలో వాన్స్ ఆహ్వానం లేకుండా ఆ దేశానికి వెళ్లడమే కాకుండా అమెరికా మద్దతు లేకుండా గ్రీన్‌లాండ్ మనుగడ సాగించడం కష్టమని విమర్శలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గ్రీన్‌లాండ్‌లో జరిగే సంప్రదాయ డాగ్సెడ్ రేసు వీక్షించేందుకు ఉషావాన్స్ పర్యటించనున్నట్టు శ్వేతసౌధం ఇటీవల వెల్లడించింది. అంతేకాదు.. ఉషతోపాటు ఆమె కుమారుడు, అమెరికా ప్రతినిధుల బృందం ఉంటుందని పేర్కొంది. గ్రీన్లాండ్ సంప్రదాయాలను ఆమె తెలుసుకొంటారని వెల్లడించింది. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు వాల్ట్ కూడా అక్కడ పర్యటించనున్నట్లు పేర్కొంది. దీనిపై గ్రీన్‌లాండ్, డెన్మార్క్ ప్రభుత్వాలు అసహనం వ్యక్తంచేశాయి. గ్రీన్‌లాండ్‌లో ప్రైవేట్ లేదా అధికారిక సందర్శనలకు తాము ఎటువంటి ఆహ్వానాలు ఇవ్వలేదని అధికారులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఇక డెన్మార్క్ ప్రధాని ఫ్రెడ్రిక్సన్ ఓ వార్తా సంస్థకు తన స్పందన తెలియజేశారు. అమెరికా ప్రతినిధి బృందం పర్యటన అంశాన్ని కొంత తీవ్రంగానే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. డెన్మార్క్ భాగంగా గ్రీన్‌లాండ్ స్వయంప్రతిపత్తి కలిగిన దీవిగా కొనసాగుతోంది. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న తన మనసులో మాటను ట్రంప్ పలుమార్లు బయటపెట్టారు. 2016లో అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఆయన ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. గ్రీన్‌లాండ్‌లో రాగి, లిథియంవంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల్లో వీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో అమెరికా వాటిపై దృష్టిపెట్టింది. అయితే గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదని, భవిష్యత్తులో అమ్మే ప్రసక్తే లేదని ఆ దేశ ప్రధాని మ్యూట్ బౌరప్ ఎగిడే స్పష్టంచేశారు.

# మనం మనం ఒకటి!

## భారత్‌తో సబంధాల పునరుద్ధరణకు కెనడా యత్నం



రెండేళ్లుగా పతనమవుతూ వస్తున్న భారత్-కెనడా సంబంధాలకు మరమ్మతులు చేసేందుకు ఇరుదేశాలూ యత్నిస్తున్నాయి. గతేడాది ఉపసంహరించుకొన్న దౌత్యవేత్తలను తిరిగి పంపేందుకు యత్నాలు మొదలుపెట్టినట్టు బ్లూమ్బర్గ్ పత్రిక కథనం వెలువరించింది. దీనిలోభాగంగానే ఇటీవల భారత్ నిర్వహించిన ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌కు కెనడా నిఘా విభాగాధిపతి డేనియల్ రోజర్స్ హాజరయ్యారని తెలుస్తోంది. ఈ సదస్సును జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈక్రమంలో కెనడాలోని అల్బెర్టాలో జరగనున్న జీ-7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీ, కెనడా నూతన ప్రధానితో భేటీ అయ్యే అవకాశాలున్నాయి. ఈ గ్రూపు సదస్సుకు భారత్ అబ్జర్వర్ హోదాలో హాజరుకానుంది. ఇక కెనడాలో మార్క్ కార్నీ అధికారం చేపట్టిన తర్వాత భారత్‌తో సంబంధాల పునరుద్ధరణపై దృష్టిపెట్టారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరుదేశాలను లక్ష్యంగా చేసుకోవడంతో ఆ ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ వ్యూహం ఎంచుకొంది. మార్చి 4న కెనడా ప్రధానిగా గెలవడానికి ముందు కార్నీ మాట్లాడుతూ "ఏకరూప ఆలోచనా విధానం కలిగిన దేశాలతో కెనడా వాణిజ్య భాగస్వామ్యాలను విస్తరించాలని భావిస్తోంది. అదే సమయంలో భారత్‌తో సంబంధాన్ని పునరుద్ధరించేందుకు చాలా అవకాశాలున్నాయి" అని వ్యాఖ్యానించారు. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనక న్యూఢిల్లీ హస్తం ఉందని 2023 సెప్టెంబర్లో కెనడా ప్రధాని ట్రూడో తీవ్ర ఆరోపణలు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయి. కాగా, భారత్ మాత్రం ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. ఇక తాజాగా కెనడా ఎన్నికల్లో న్యూఢిల్లీ జోక్యం చేసుకోనుందని ఆ దేశ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. పరోక్షంగా కొందరు ఏజెంట్ల ద్వారా భారత్ ఆర్థికసాయం పంపిస్తోందంటూ పేర్కొన్న విషయం తెలిసిందే.

# పుతిన్.. సాగదీస్తున్నారు!

**కాల్పుల విరమణ వ్యవహారంపై ట్రంప్ కొత్త మాట**



ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యా వైఖరిపై సానుకూలంగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. కీవ్‌తో కాల్పుల విరమణ అంశాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ కావాలనే సాగదీస్తున్నారని అన్నారు. వాషింగ్టన్ మధ్యవర్తిత్వాన్ని మాస్కో తారుమారు చేస్తోందని ఆరోపించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ దీనిగురించి మాట్లాడారు. "యుద్ధానికి ముగింపు పలకాలని రష్యా కోరుకుంటోందని నేను అనుకుంటున్నా. కానీ, ఇప్పుడు వారి కాళ్లను వారే లాక్కుంటున్నారని అనిపిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా మధ్యవర్తిత్వం చేస్తున్నప్పటికీ, పుతిన్ ఉద్దేశపూర్వకంగా దాన్ని అడ్డుకుంటున్నట్టు కన్పిస్తోంది. ఏదేమైనప్పటికీ ఈ మారణహోమాన్ని నేను ఆపాలనుకుంటున్నా. కీవ్‌కు అందిస్తున్న ఆర్థిక సాయానికి ముగింపు పలకాలనుకుంటున్నా" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 30 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనకు ఇప్పటికే ఉక్రెయిన్ అంగీకరించిన సంగతి తెలిసిందే. దీనిపై మాస్కోను ఒప్పించేందుకు అగ్రరాజ్యం చర్చలు ప్రారంభించింది. సౌదీ వేదికగా రష్యాతో అమెరికా అధికారులు మంతనాలు చేస్తున్నారు.

ఇందులోభాగంగానే నల్ల సముద్రంలో దాడులను నిలిపివేసేందుకు ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు శ్వేతసౌధం మంగళవారం ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ట్రంప్.. పుతిన్‌పై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల పుతిన్‌తో ట్రంప్ ఫోన్లో మాట్లాడిన అనంతరం.. కాల్పుల విరమణ ఒప్పందానికి మాస్కో కూడా సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అయితే, రష్యాపై పశ్చిమదేశాల ఆంక్షలు ఎత్తివేస్తేనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేస్తామని పుతిన్ షరతు పెట్టినట్టు తెలుస్తోంది. అంతేగాక.. జపోరిజియా అణు విద్యుత్ ప్లాంట్‌ను ఉక్రెయిన్‌కు తిరిగిచ్చేందుకు కూడా రష్యా నిరాకరిస్తున్నట్టు సమాచారం.

# మస్క్.. అమెరికన్ కాదు

**ఆయన సేవలు పనికొచ్చేవీ కావు..**

**-వాన్స్ వ్యాఖ్యానించినట్టు సోషల్ మీడియాలో ఆడియో కథనం**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో జేడీవాన్స్ ఉపాధ్యక్షుడిగా, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 'డోజ్' సారథిగా కొనసాగుతున్నారు. అధికారిక కార్యక్రమాల్లో ట్రంప్ వెంటే కనిపించే వీరిద్దరికీ పొసగడం లేదా..? మస్క్‌ను వాన్స్ విమర్శించారా..? ఈ వార్తల్లో నిజమెంత..? ఎలాన్ మస్క్‌ను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విమర్శిస్తున్న ఆడియో క్లిప్ ఒకటి ఎక్స్‌లో వైరల్‌గా మారింది. మస్క్ అమెరికన్ కాదు.. దక్షిణాఫ్రికాకు చెందిన వ్యక్తి అని వాన్స్ పేర్కొనట్టు అందులో వినిపిస్తోంది. అలాగే కుబేరుడి చర్యలు ట్రంప్ పాలనకు ఉపకరించడం లేదని, ఆయన ఎన్నికైన అధికారిలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించినట్టుగా ఉంది. ఈ క్లిప్‌ను ఓ యాక్టివిస్ట్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసి.. "అంతర్గత పోరు తీవ్రస్థాయిలో ఉంది" అని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం జేడీ వాన్స్ దృష్టికి చేరడంతో ఆయన స్పందించారు.

"అది ఏఐతో సృష్టించిన నకిలీ వీడియో. ఈ వ్యక్తికి వాస్తవాన్ని గుర్తించే తెలివితేటలు లేకపోవడం నాకేమీ ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఇప్పుడు అది నకిలీదని తెలిసిన తర్వాతైనా దానిని తొలగిస్తారా..? అలా చేయకపోతే, అది పరువునష్టం కిందికే వస్తుంది" అని పోస్టు పెట్టారు.

### అదంటే నాకు పిచ్చి..

# డబ్బులుంటే క్రికెట్ మానేసి అదే చేస్తా!: గ్లెన్ ఫిలిప్స్




పక్షిలా గాల్లోకి ఎగురుతూ క్యాచ్‌లు పట్టడం.. పాదరసంలా కదులుతూ ఫీల్డింగ్ విన్యాసాలు చేయడం అంటే ప్రస్తుత క్రికెట్ లో గుర్తొచ్చే పేరు గ్లెన్ ఫిలిప్స్. అతడు డైవ్‌లు చేస్తూ క్యాచ్‌లు పట్టేస్తుంటే ప్రేక్షకులను మతి పోతుంటుంది. అయితే తాజాగా అతడు తాను క్రికెటర్ కాకపోయి ఉంటే ఏం అయ్యేవాడో వివరించాడు. ఇంకా క్రికెట్ లో రిటైర్మెంట్ అయ్యాక తానేం చేయాలనుకుంటున్నాడో తెలిపాడు.

***గాల్లో ఎగరడం ఇష్టం..***

మైదానంలో ఫీల్డింగ్ చేసేటప్పుడు గాల్లోకి ఎగిరి ఎలా అయితే క్యాచులు పట్టడం ఎలా అయితే ఇష్టమో.. నిజజీవితంలోనూ గాల్లోకి ఎగరడమంటే బాగా ఇష్టమని చెప్పాడు ఫిలిప్స్. "గాల్లో ఎగరడం, ప్రయాణించడమంటే చాలా ఇష్టం. ఒకవేళ నేను క్రికెట్ ఆడకపోయి ఉంటే, అలానే ప్రపంచంలోని డబ్బుంతా నా దగ్గర ఉంటే, నా జీవితంలో నేను పైలెట్ అయ్యేవాడిని. నా జీవితాన్ని కూడా పైలెట్ తోనే ముగించేవాడిని. నాకు గాల్లో ఉండటమంటే చాలా ఇష్టం." అని అన్నాడు.

***నాకు కూడా తెలీదు..***

"పైలెట్ గా ఉండటానికి సంబంధించిన విధానాలు, రేడియో కమ్యూనికేషన్స్ సహా అతడి చుట్టు ఉండే వాతావరణం అన్నీ బాగా ఇష్టపడతాను. ముఖ్యంగా విమానాన్ని హ్యాండిల్ చేయడాన్ని బాగా ఆస్వాదిస్తాను. నిజంగా నాకు తెలీదు మరి అది అంటే అంత ఎందుకు ఇష్టమో. నేనే కాదు విమానాన్ని ప్రేమించే వారు ఎవరైనా సరైన కారణం చెప్పలేరు. అయినా విమానంలో ప్రయాణించడం, ఎగరడం అనేది మనుషులు ఎప్పటి నుంచో కోరుకున్న అనుభూతే. కాబట్టి, నేను కూడా దానిని అతీతుడిని ఏమీ కాదని భావిస్తున్నాను. " అని వెల్లడించాడు.

***పర్వత ప్రాంతాల్లో...***

తాను క్రికెట్ లో రిటైర్మెంట్ అయ్యే సమయానికి కావాల్సినంత డబ్బు సంపాదించలేకపోతే, పైలెట్ గా మారుతానని చెప్పాడు ఫిలిప్స్. "క్రికెట్ తర్వాత నేను ఏదైనా నచ్చిన పని చేస్తూ ఆనందంగా గడపాలనే కోరిక ఉంది. అందులో పైలెట్ కూడా ఒకటి.

అసలు క్రికెట్ తర్వాత కూడా ఏదైనా పని చేయాల్సి వస్తే అది పైలెట్ గా మాత్రమే చేసేందుకు ప్రాధాన్యత ఇస్తాను. లేదంటే ఏ పనిపై పై ఆధారపడకుండా పర్వత ప్రాంతాల్లో సమయం గడపగలిగితే అది నాకు అందమైన జీవనం అవుతుంది." అని పేర్కొన్నాడు. ఇకపోతే గాల్లోకి ఎగిరి క్యాచులు పట్టడం తనకు సహజంగా వచ్చిన ప్రతిభ అని చెప్పాడు ఫిలిప్స్. అలానే తాను సాధన చేస్తూ శ్రమిస్తానని కూడా చెప్పాడు.

# ఐపీఎల్ 2025.. రాజస్థాన్‌పై కేకేఆర్ విజయం

ఐపీఎల్ 2025 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) ఎట్టకేలకు బోణీ చేసింది. ఓటమితో ఈ సీజన్ ప్రారంభించిన కేకేఆర్.. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. క్వింటన్ డికాక్(61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్‌తో కేకేఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 151 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్(28 బంతుల్లో 5 ఫోర్లతో 33), యశస్వి జైస్వాల్(24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 29) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి(2/17), మొయిన్ అలీ(2/23), హర్షిత్ రాణా(2/36), వైభవ్ అరోరా(2/33) రెండేసి వికెట్లు తీయగా.. స్పెన్సర్ జాన్సన్ ఓ వికెట్ పడగొట్టాడు.

**డికాక్ విధ్వంసం..**

అనంతరం కేకేఆర్ 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 153 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. క్వింటన్ డికాక్‌తో పాటు, అంగ్‌క్రిష్ రఘువంశీ(17 బంతుల్లో 2 ఫోర్లతో 22 నాటౌట్) రాణించాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగా ఒక్కడే వికెట్ తీసాడు. లక్ష్యఛేదనలో కేకేఆర్‌కు ఆశించిన శు భారంభం దక్కలేదు. వికెట్ స్లోగా ఉండటంతో కేకేఆర్ ఓపెనర్లు ఆచితూచి ఆడారు. దాంతో



పవర్ ప్లేలో కేకేఆర్ 40 పరుగులే చేసింది.

అనంతరం మొయిన్ అలీ(5) రనౌటవ్వగా.. రహానేతో కలిసి డికాక్ ఆచితూచి ఆడాడు. రహానేను హసరంగా ఔట్ చేయగా.. రఘు వంశీతో కలిసి డికాక్ చెలరేగాడు. 36 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసుకున్న అతను ఆ తర్వాత భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. భారీ సిక్సర్‌తో ఈ మ్యాచ్‌ను ముగించాడు.

**మ్యాచ్ టర్నింగ్ పాయింట్..**

కేకేఆర్ స్పిన్నర్లు అయిన వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీ అద్భుత ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్ పతనాన్ని శాసించారు. స్పిన్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై వరుస విరామాల్లో వికెట్లు తీసి రాజస్థాన్ రాయల్స్‌ను కోలుకోలేని దెబ్బతీసారు. ఈ ఇద్దరూ 8 ఓవర్లలో 40 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టారు. దాంతో పవర్ ప్లేలో దూకుడుగా ఆడిన రాజస్థాన్ రాయల్స్.. స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. సంచలన బౌలింగ్‌తో రియాన్ పరాగ్, యశస్వి జైస్వాల్, వానిందు హసరంగా, నితీష్ రాణాలను ఔట్ చేసి మ్యాచ్‌ను కేకేఆర్‌వైపు మలుపు తిప్పారు.

# ధోనీ మైదానంలో కాలు మోపగానే మోతమోగింది!: అశ్విన్

అభిమానులకు ధోనీ మీద ఉన్న క్రేజ్ గురించి టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో వివరించారు. ఐపీఎల్ 2025లో భాగంగా ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. చెన్నై టీమ్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో 19వ ఓవర్ ముగిసిన తర్వాత రవీంద్ర జడేజా రనౌట్‌గా వెనుదిరిగాడు. అనంతరం మహేంద్ర సింగ్ ధోనీ మైదానంలో అడుగు పెట్టాడు. ఆ సమయంలో మైదానం అంతా మోత మోగింది. ధోనీ అభిమానులంతా ఈలలు, కేకలతో స్వాగతం పలికారు. అప్పుడు మైదానంలో షోర్ మీటర్ ప్రకారం 122 డెసిబెల్స్ శబ్దం నమోదైంది. దాదాపు 10 సంవత్సరాల తర్వాత అశ్విన్ తిరిగి చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో భాగమయ్యాడు. అభిమానుల ఉత్సాహాన్నంతా అతడు డ్రెస్సింగ్ రూమ్ నుంచి వీక్షించాడు. 'చెన్నైలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఎప్పుడైతే ధోనీ బ్యాటింగ్ చేయడానికి వచ్చాడో... అప్పుడు ఒక్కసారిగా మైదానంలో వాతావరణం మారిపోయింది. అంత వరకు దాదాపు నిశ్శబ్దంగా ఉన్న మైదానంలో ఒక్కసారిగా మోతమోగింది. అభిమానుల కేరింతలు, కేకలతో గ్రౌండ్ అంతా దద్దరిల్లింది. ఇది ఫ్యాన్స్‌కు ధోనీ మీద ఉన్న ప్రేమకు తార్కాణం. నేను ఇంతకు ముందు ఈ సన్నివేశాలను బయట నుంచి



చూసేవాణ్ని. కానీ మొదటిసారి డ్రెస్సింగ్ రూం నుంచి చూశా' అని రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో వివరించాడు.

# 4-1 తేడాతో పాక్‌పై కివీస్ ఘనవిజయం

పాకిస్తాన్ క్రికెట్ జట్టు న్యూజిలాండ్ పర్యటనలో ఉంది. టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న పాకిస్తాన్ జట్టు చెత్త ప్రదర్శనలను కొనసాగిస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో.. ఐదు మ్యాచ్‌లలో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే మెరుగైన ప్రదర్శన చేసింది. మిగతా మ్యాచ్‌లలో గల్లీ జట్ల కంటే ఘోరంగా ఆడిన పాకిస్తాన్ జట్టు మరోసారి తమ చెత్త ప్రదర్శనలను రిపీట్ చేసింది. ఈ సిరీస్ లోని ఐదో మ్యాచ్ నేడు వెల్లింగ్‌టన్ లోని స్కై స్టేడియం వేదికగా జరిగింది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ దారుణమైన ఓటమిని ఎదుర్కొంది. ఈ మ్యాచ్‌లో కివీస్ జట్టు ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి గొప్ప విజయాన్ని సాధించారు. ఈ మ్యాచ్ లో న్యూజిలాండ్ పాకిస్థాన్‌ను ఓడించి సిరీస్‌ను 4-1 తేడాతో గెలుచుకుంది. న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్ లో పాకిస్థాన్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఐదు కీలక మార్పులు చేసింది. దీని తర్వాత కూడా పాకిస్తాన్ ఈ మ్యాచ్ లో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది.

**128 పరుగులు చేసిన పాకిస్థాన్**

ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్




20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. పాకిస్థాన్ జట్టుకు మ్యాచ్ ప్రారంభం ముందే మంచి ఆరంభం లభించలేదు. ఎందుకంటే ఓపెనర్ హసన్ నవాజ్ 3 బంతుల్లో డకౌట్‌గా వెనుదిరగగా.. మహ్మద్ హారిస్ 17 బంతుల్లో 11 పరుగులు చేసి ఔటయ్యాడు. దీని తర్వాత మూడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన ఉమెర్ యూసుఫ్ కూడా నిరాశపరిచాడు. అతను 7 పరుగులు చేశాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసిన కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా 39 బంతుల్లో పరుగులు చేసి ఇన్నింగ్స్ ఆడాడు. ఇది కాకుండా షాదాబ్ ఖాన్ 20 బంతుల్లో 28 పరుగులు చేశాడు.

**లక్ష్యాన్ని సాధించిన న్యూజిలాండ్**

129 పరుగుల సులభమైన లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు అలవోకగా ఛేదించింది. న్యూజిలాండ్ ఆటగాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ 38 బంతుల్లో 97 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 6 ఫోర్లు, 19 సిక్సర్లు ఉన్నాయి. అదే సమయంలో ఫిన్ అలెన్ 12 బంతుల్లో 27 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ కేవలం 10 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ 5 మ్యాచ్ ల సిరీస్ లో పాకిస్థాన్ రెండో టీ20లో మాత్రమే గెలిచింది. మిగిలిన 4 మ్యాచ్ లలో పాకిస్థాన్ కు నిరాశ ఎదురైంది.

**5 వికెట్లు పడగొట్టిన జేమ్స్ నీషమ్**

న్యూజిలాండ్ విజయంలో క్రెడిట్ జేమ్స్ నీషమ్ కు దక్కుతుంది. ఎందుకంటే జేమ్స్ నీషమ్ ఈ మ్యాచ్ లో తన అద్భుతమైన బౌలింగ్ తో అదరగొట్టాడు. తాను వేసిన 4 ఓవర్లలో 22 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అతనితో పాటు జాకబ్ డఫీ 2 వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ తరపున సూఫియా ముఖీమ్ రెండు వికెట్లను పడగొట్టాడు.

## చిరుతో అలా మిస్సయ్యా...!



'రాబిన్హుడ్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు దర్శకుడు వెంకీ కుడుముల. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కెరీర్‌లో ఐదేళ్ల గ్యాప్ రావడంపై స్పందించారు. తాను ఎంతగానో ఇష్టపడే చిరంజీవితో సినిమా ఆగిపోవడం పైనా మాట్లాడారు. చిరంజీవి వల్లే తాను సినిమాల్లోకి వచ్చానని అన్నారు. తాను చెప్పిన కథ ఆయనకు పెద్దగా నచ్చలేదని అన్నారు. అందుకే ఆ సినిమా చేయలేదని తెలిపారు.

"అగ్ర కథానాయకుడు చిరంజీవికి నేను వీరాభిమానిని. ఆయనవల్లే నేను సినిమాల్లోకి వచ్చాను. జీవితంలో ఒక్కసారైనా ఆయన్ని కలిసి ఫొటో దిగాలి అనుకునేవాడిని. అలాంటిది 'భీష్మ' తర్వాత ఆయన్ని డైరెక్ట్ చేసే అవకాశం వచ్చినప్పుడు ఎంతో సంతోషించా. ఒక కథ రాసుకున్నా. అది ఆయనకు చెప్పాను. అయితే అది ఆయనకు పెద్దగా నచ్చలేదు. వెంకీ మరో కథ రాయి.. తప్పకుండా చేసేద్దామన్నారు. కాకపోతే, ఆ వెంటనే నాకు అంత మంచి ఆలోచన రాలేదు. దాంతో నాలో ఉన్న అభిమాని ఒకింత బాధపడ్డాడు. ఆయనతో సినిమా చేస్తే అది వేరే లెవల్లో ఉండాలని ఫిక్స్ అయ్యా. ఆయనతో అదే మాట చెప్పి.. వేరే సినిమా చేసి వస్తానని అన్నాను. దానికి ఆయన అంగీకరించారు. ఆయన ఎంతో సపోర్ట్ చేస్తుంటారు. ఇప్పటికీ సందేశాలు పంపుతూనే ఉంటారు" అని వెంకీ కుడుముల తెలిపారు.

ఆయన కెరీర్‌లో ఐదేళ్ల గ్యాప్ రావడంపై మాట్లాడుతూ.. "ప్రతి మనిషి జీవితంలో జయాపజయాలు ఉంటాయి. గత ఐదేళ్లు నేనొక ఫెయిల్యూర్నే. జీవితంలో అనుకున్నవి ఏమీ సాధించలేకపోయా. ఇష్టమైన నటుడు చిరంజీవితో సినిమా చేయలేకపోయా. ఇంట్లో వాళ్లు కూడా పెళ్లి చేయాలనుకుంటే వద్దని ఆపాను. ఆవిధంగా వాళ్లనూ సంతోష పెట్టలేకపోయాను. రాబిన్‌హుడ్ సమయంలోనూ పెళ్లి విషయంలో వాళ్లు ఎంతో ఒత్తిడి చేశారు. కాకపోతే, నా దృష్టి మొత్తం ఈ సినిమా పైనే ఉందని వాళ్లకు చెప్పాను. ఎందుకంటే ఇన్నేళ్ల విరామం తర్వాత వస్తున్నప్పుడు ఇది నా కెరీర్‌కు ఎంతో ముఖ్యమైనది" అని ఆయన వెల్లడించారు.

రాబిన్‌హుడ్ ప్రీ రిలీజ్ ఈవెంట్లో డేవిడ్ వార్నర్‌ను ఉద్దేశించి రాజేంద్ర ప్రసాద్ చేసిన వ్యాఖ్యల పైనా వెంకీ స్పందించారు. అనుకోకుండా రాజేంద్రప్రసాద్ ఆవిధంగా మాట్లాడారని అన్నారు. ఆ తర్వాత ఆయన ఎంతో బాధపడ్డారని చెప్పారు. జరిగిన వివాదం గురించి వార్నర్‌కు తాను వివరించానని తెలిపారు. ఈ విషయాన్ని వార్నర్ పెద్దగా పట్టించుకోలేదని.. క్రికెట్లో ఉండే స్లెడ్జింగ్తో పోలిస్తే ఇది చాలా బెటరన్నారని చెప్పారు. నితిన్ హీరోగా నటించిన 'రాబిన్ హుడ్' చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది.




## ప్రార్థన కూడా తప్పేనా..



మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ ఇటీవల శబరిమలను సందర్శించిన విషయం తెలిసిందే. తన ఆప్త మిత్రుడు, నటుడు మమ్ముట్టి కోసం అక్కడ ఆయన ప్రత్యేక పూజలు జరిపించారు. దీనిపై వివాదం నెలకొనడంతో తాజాగా ఆయన స్పందించారు. అందులో తప్పేముందని ప్రశ్నించారు. మార్చి 18న శబరిమలను సందర్శించారు మోహన్‌లాల్. ఆ సమయంలో మమ్ముట్టి పేరు మీద ఉషా పూజ జరిపించారు. ఆ పూజ సమయంలో మమ్ముట్టి అసలు పేరు మహ్మద్ కుట్టి అని చెప్పారు. అంతేకాకుండా కుటుంబసభ్యుల పేర్ల మీద కూడా మోహన్‌లాల్ పూజలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. దీనిపై పలువురు స్పందిస్తూ.. మమ్ముట్టి గురించి శబరిమలలో పూజలు చేయడాన్ని తప్పుపట్టారు.అలా ఎలాచేస్తారని ప్రశ్నించారు. దీనిపై మోహన్‌లాల్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించారు. "అతని కోసం పూజలు చేస్తే తప్పేంటి?. అది నా వ్యక్తిగత విషయం. ప్రస్తుతం అతను ఆరోగ్యంగానే ఉన్నాడు. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురయ్యాడు. అలాంటి ఆరోగ్య సమస్య అందరికీ వస్తుంది. కాబట్టి, ఆయన ఆరోగ్యం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని వెల్లడించారు.

దేవస్థానానికి చెందినవారే పూజకు సంబంధించిన వివరాలు బయటకు చెప్పి ఉండొచ్చని ఆయన ఆరోపించారు.ఈ వ్యాఖ్యలపై ఆలయ బోర్డు సభ్యులు స్పందించారు. "మోహన్‌లాల్ అపార్థం చేసుకున్నట్లు ఉన్నారు. అందుకే ఆయన ఆవిధంగా వ్యాఖ్యలు చేశారు. ఆయన తన తప్పును సరిచేసుకుంటారని భావిస్తున్నాం" అని తెలిపారు. మరోవైపు, మమ్ముట్టి తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు ఇటీవల వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఆయా కథనాలను ఆయన టీమ్ కొట్టి పారేసింది. "మమ్ముట్టి ఆరోగ్యం గురించి జరుగుతోన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. రంజాన్ కారణంగా ఆయన షూట్స్‌నుంచి బ్రేక్ తీసుకొని వెకేషన్‌కు వెళ్లారు. విరామం నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఆయన మోహన్‌లాల్‌తో కలిసి మహేశ్ నారాయణన్ చిత్రంలో పాల్గొనున్నారు" అని టీమ్ వెల్లడించింది.

## ఫ్యాన్స్‌కి ట్రీటిస్తాడు!

రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా దర్శకుడు సానా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న భారీ చిత్రం కోసం -ఫ్యాన్స్ లక్షల కళ్లేసుకుని ఎదురు చూస్తున్నారు. రామ్ చరణ్ కెరీర్‌లో 16వ సినిమాగా దీన్ని ప్లాన్ చేస్తుంటే.. గేమ్ ఛేంజర్‌లాంటి డిజాస్టర్‌ను మర్చిపోవడానికి ఈ సినిమా ఎంత తొందరగా వస్తే అంత మంచిదన్న అభిప్రాయంతో ఉన్నారు మెగా అభిమానులు. అయితే ఈ సినిమానుంచి మార్చి 27న చరణ్ బర్త్‌డే కానుకగా ట్రీట్ ఉంటుందా? లేదా? అనే సంశయం అభిమానుల్లో నిన్నటి వరకూ ఉంది. కానీ ఇపుడు డెఫినెట్‌గా ట్రీట్ ఉంటుందనే తెలుస్తుంది. అలాగే టైటిల్ గ్లింప్స్ పనులు ఆల్రెడీ పూర్తి కాగా.. ఏఆర్ రెహమాన్ దానికి సాలిడ్ స్కోర్‌ని అందించే పనిలో ఉన్నట్టుగా చెబుతున్నారు. ఇక వీటితో ఏ సమయంలోనైనా సినిమా అప్డేట్ రానున్నట్టుగా టాక్. ప్రస్తుతానికి పెద్ది అనే టైటిల్‌తోనే మేకర్స్ సాలిడ్ గ్లింప్స్‌ని వదిలే సన్నాహాలు చేస్తున్నారట. మరి ఇది ఏ లెవెల్లో ఉంటుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తుండగా.. మైత్రి మూవీ మేకర్స్ సహకారం అందిస్తున్నారు.



## అవన్నీ.. ఉత్తిమాటలు

నయనతార ప్రధాన పాత్రలో సుందర్.సి దర్శకత్వంలో రానున్న చిత్రం 'మూకుతీ అమ్మన్ 2'. ఇటీవలే సినిమా షూటింగ్ మొదలైంది. చిత్రానికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారమవుతున్నాయి. సినిమా సెట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌కు, నయనతారకు మధ్య వివాదం జరిగిందని.. దీంతో షూటింగ్ నిలిపివేశారన్న వార్తలు ప్రచారమవుతున్నాయి. అలాగే దర్శకుడితోనూ నయన్‌కు విభేదాలు వచ్చాయన్న రూమర్స్ లేకపోలేదు. తాజాగా ఈ విషయంపై సుందర్.సి భార్య ఖుష్బూ క్లారిటీ ఇచ్చారు. ఎక్స్ వేదికగా ఆ వార్తలను ఖండించారు.



"మూకుతీ అమ్మన్ 2' సినిమాపై ఎన్నో రూమర్స్ సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. దయచేసి రూమర్స్ సృష్టించేవాళ్లు కాస్త విశ్రాంతి తీసుకోండి. ఈ సినిమా షూటింగ్ సజావుగా సాగుతోంది. అనుకున్న ప్రణాళిక ప్రకారమే చిత్రీకరణ జరుగుతోంది. ఇలాంటి రూమర్స్‌ను సుందర్ అసలు పట్టించుకోరని అందరికీ తెలుసు. నయనతార చాలా గొప్ప నటి. గతంలో ఆమె చేసిన పాత్రను ఇప్పుడు మరోసారి పోషిస్తున్నందుకు సంతోషం. సినిమాపై ఇలాంటి నిరాధారమైన రూమర్స్ సృష్టించకండి. సినిమాపై అభిమానులు చూపిస్తోన్న ప్రేమకు ధన్యవాదాలు. ఎప్పుడూ మీ సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. సుందర్.సి నుంచి మరో బ్లాక్‌బస్టర్ కోసం ఎదురుచూడండి" అని పోస్ట్ పెట్టారు. దీంతో ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడింది. 'మూకుతీ అమ్మన్ 2' విషయానికొస్తే.. నయనతార కథానాయికగా ఆర్జే బాలాజీ తెరకెక్కించిన చిత్రమే 'మూకుతీ అమ్మన్'. 2020లో ఇది విడుదలై విశేష ఆదరణను సొంతం చేసుకుంది. అమ్మవారి పాత్రలో నయనతార నటించారు. ఇదే చిత్రం తెలుగులో 'అమ్మోరు తల్లి'గా విడుదలైంది. దీనికి కొనసాగింపుగా వస్తోన్న చిత్రమే 'మూకుతీ అమ్మన్ 2'.

## వాళ్ల స్కెచ్చేమో అనుకున్నా

ఆమిర్‌ఖాన్ కెరీర్లోనే ఉత్తమ చిత్రంగా నిలిచింది 'దంగల్'. 2016లో విడుదలైన సినిమా భారతీయ సినీ పరిశ్రమలోనే చరిత్ర సృష్టించింది. మొదట సినిమాను తాను అంగీకరించాలని అనుకోలేదని ఆమిర్ తెలిపారు. సినిమా విషయంలో షారుక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్లను అపార్థం చేసుకున్నట్టు సరదాగా చెప్పారు. "నా సినిమాలను ట్రెండుకు తగినట్లు, ప్రేక్షకుల అంచనాలకు అనుగుణంగా ఎంపిక చేసుకుంటాను. బాక్సాఫీస్ నెంబర్లకంటే నా వ్యక్తిగత నమ్మకం ఆధారంగా ఎంచుకున్న సినిమాలు ఎన్నో సార్లు హిట్‌గా నిలిచాయి. 'లగాన్', 'దంగల్' సినిమాలే ఇందుకు ఉదాహరణ. 'దంగల్' సినిమా స్క్రిప్ట్ నా దగ్గరకు వచ్చినప్పుడు నా కెరీర్‌ను దెబ్బతీయడం కోసం షారుక్, సల్మాన్లు పంపారని అపార్థం చేసుకున్నాను. స్క్రిప్ట్ చదివాక ఓకే చెబుతానని దర్శకుడికి చెప్పాను. నితీశ్ తివారీ మాత్రం నేనే ఈ సినిమా చేయాలని పట్టుబట్టారు. నాకోసం పదిహేనేళ్లైనా వేచి ఉంటానన్నారు. స్క్రిప్ట్ చదివాక చాలా శక్తిమంతమైనదిగా అనిపించింది. 'దంగల్‌కు ముందే నేను 'ధూమ్ 3' చేశాను. అందులో యంగ్‌లుక్‌లో కనిపించాను. వెంటనే ఈ సినిమాలో తండ్రి పాత్ర పోషించేందుకు సంకోచించాను. స్క్రిప్ట్ నచ్చడంతో నా కెరీర్లో రిస్క్ తీసుకొని అయినా దీంట్లో నటించాలని నిర్ణయించుకున్నాను" అని చెప్పారు. ప్రముఖ కుస్తీ క్రీడాకారుడు మహావీర్ ఫోగట్ అతడి కుమార్తెల జీవితం ఆధారంగా 'దంగల్' తెరకెక్కింది. దేశ వ్యాప్తంగా వసూళ్ల సునామీ సృష్టించిన సినిమా చైనా లోనూ మంచి కలెక్షన్లు సాధించి రికార్డులు నెలకొల్పింది.

